ఘరానా హంతకుడు

వసుంధర

"ఆయనింట్లో లేరు" అంది సీత.

అతను నవ్వి "కావచ్చు. కానీ ఇంటికి వస్తారేమో కదా" అన్నాడు.

"వస్తారు. కానీ అందుకింకా రెండుగంటలు టయిముంది" సందేహంగా అంది సీత.

"ఫరవాలేదు. అంతసేపు వేచివుండడం నాకు కష్టం కాదు" అంటూ లోపల కడుగు వేశాడతను.

ఏంచేయాలో తోచలేదు సీతకు. అతను చూడ్డానికి చాలా మర్యాదస్తుడిలా కనబడుతున్నాడు. వయసు ముప్పైఏళ్ళుండవచ్చు. మాటల్లో సంస్కారం కనబడుతోంది. కానీ ఇంట్లో తనొక్కర్తే ఉంది. భర్త లేకుండా

అతను తనింట్లో రెండుగంటలసేపు వుండడం తనకు భయం కలిగించడం మాటటుంచి చూసేవాళ్ళకు బాగుండదు.

"మీ రెవరో తెలుసుకోవచ్చా?" అనడిగింది సంకోచంగా.

"ఏమీ కంగారుపడనవసంలేదు. అన్నయ్యా అని నన్ను నువ్వు పిలిస్తే ఆ పిలుపుకు అన్నివిధాలా న్యాయం చేకూర్చేలా ప్రవర్తించగలను" అన్నాడతను.

అతని ఏకవచన ప్రయోగం సీతకు చాలా బాధ కలిగించింది. అయినా ఏమీ అనలేకపోయింది. ఎటొచ్చీ అతని మాటలు మనసుకు కాస్త శాంతినిచ్చాయి. "ఇంతకీ మీ రెవరో చెప్పలేదు" అంది మళ్ళీ.

అతను చనువుగా వెళ్ళి ఒక కుర్చీలో కూర్చున్నాడు. సీత తలుపులు వేయలేదు. ఆమె గుమ్మందగ్గరే నిలబడింది.

"నే నెవరినో తెలుసుకోవలసిన అవసరం నీకు లేదు' కానీ నువ్వు నన్నందరికీ నీ అన్నయ్యగా పరిచయం చేయాలి. అది నీకే మంచిది" అన్నాడతను.

సీతకు చిరాకేసింది "నువ్వెవరో నాకు తెలియదు. నిన్ను నా అన్నవని చెప్పుకోవాల్సిన అవసరం నాకేముంది?"

అతను చాలా తమాషాగా నవ్వి "వెరీగుడ్"అన్నాడు. "నువ్వు నన్నలా నువ్వనడమే బాగుంటుంది. అన్నయ్యా నే చెల్లెలూ మీరు మీరు అంటూ మన్నించదు." అని ఒక్క క్షణం ఆగి "నన్ను నీ అన్నగా చెప్పుకోవలసిన అవసరం నీకు బాగా వుంది. నేనీ ఇంట్లో కొంతకాలంపాటు అతిథిగా ఉండబోతున్నాను. మరేరకమైన బంధుత్వమూ మనకు శ్రేయస్కరం కాదు" అన్నాడు.

సీత ముఖం ఎర్రబడింది. "అన్నీ నువ్వనుకుంటే సరి పోదు. మేమంగీకరించాలికదా."

"చాలా పొరబడ్డావు" అన్నాడతను. "నాకొకరి అంగీకారానంగీకారాలతో పనిలేదు. అనుకున్న పని అయే దాకా అనుకున్నచోట ఉండటానికి నేనెవరి అనుమతి కోసమూ ఎదురుచూడను."

సీత కాస్త భయపడినా తమాయించుకుని "మేమూ అంతే—మా అనుమతిలేనిదే మా ఇంట్లో ఎవ్వరూ ఒక్క క్షణం కూడా ఉండలేరు" అంది.

"అలాగా—ఆ సంగతి చూద్దాంకానీ, చూడు చెల్లాయ్ నీ పేరేమిటో చెప్పమ్మా! చెల్లెలి పేరు తెలియకుండా ఉన్నానంటే బాగుండదు" అన్నాడతను.

"మంచిది. నా పేరు సీత. నీ పేరు తెలుసుకోవచ్చా?" అనడిగింది సీత.

"కొంతమందికి పేర్లతో నిమిత్తముండదు. రోడ్డు మీద కూరలమ్మేవాడిని వాడమ్మే కూరలపేరుతో పిలుస్తారు తప్పితే పేరు తెలుసుకుందుకు ప్రయత్నించరు. అలాగే రిక్షావాళ్ళని, టాక్సీవాళ్ళని—వాళ్ళువాళ్ళు నడిపే వాహ నాల పేర్లతో పిలుస్తారు. పల్లెటూళ్ళలో అయితే కొంత మందిని బొత్తిగా పేర్లతో పిలవరు. ఏయ్ మంగలీ—ఏయ్ చాకలీ అని వాళ్ళ వృత్తుల్నిబట్టి ఆపేర్లతో పిలుస్తారు. నేనూ అలాంటివాణ్నే!"

"చాలా డొంకతిరుగుడుగా చెబుతున్నావు. పేరు చెప్పవా?"

"చెబుతాను. కానీ నువ్వు భయపడతావేమోనని సందే హిస్తున్నాను."

"నాకేం భయంలేదు. అదేవో నువ్వింట్లో అడుగుపెట్టి నప్పుడే పోయింది." అంది సీత.

"చాలా మంచిది. అయితే చెబుతున్నాను విను. వృత్తిని బట్టి నన్ను పిలవాలనుకుంటే హంతకుడు అని పిలవ్వచ్చు" అన్నాడతను.

సీత నివ్వెరపోయింది నోట మాటలేకుండా అతన్నే చూస్తూ ఉండిపోయింది.

2

ఇంట్లోకి అడుగుపెడుతూనే వీధి తలుపులు బార్లా తెరిచి ఉండడమూ, లోపల ఒక అపరిచిత వ్యక్తి కుర్చీలో కూర్చుని ఉండడమూ చూసి ఆశ్చర్యపడ్డాడు జనార్దనం. బహుశా భార్యకు సంబంధించిన బంధువై ఉంటాడను కున్నాడు.

జనార్దనాన్ని చూస్తూనే ఆగంతకుడు లేచి "వచ్చేవా-రా బావా కూర్చో!" అన్నాడు.

అతని పలకరింపుకు ఆశ్చర్యపడుతూ జనార్దనం వెళ్ళి కుర్చీలో కూర్చుని బూట్లు విప్పుకోసాగాడు.

"సీతా బావొచ్చేశాడు" అంటూ గట్టిగా కేకపెట్టాడు ఆగంతకుడు.

వంటింట్లో పక్కింటావిడతో కబుర్లుచెబుతూన్న సీత లేచింది. పక్కింటావిడ దొడ్డిదారిన వెళ్ళిపోయింది. సీత వీధి గదిలోకి వచ్చింది. ఆగంతకుడు పెట్టిన కేక ఆమెకు చాలా అసహ్యంగా అనిపించింది.

సీత రాగానే "నీ బంధువుల్లో ఇలా ఓ అన్నయ్యు న్నట్లు ముందే చెప్పివుండాల్సింది సీతా! ఇప్పుడు నేను వెర్రిముఖం వేసుకుని చూడాల్సిన అవసరం తప్పేది"

అన్నాడు జనార్దనం.

"నాకేం తెలుసు. రోడ్డునపోయే చాలామందికి నా కన్నయ్యలు కావాలనుందని" అంది సీత తీవ్రంగా. ఆగంతకుడి ముఖంలో అప్రసన్నత కనబడింది. జనార్దనం ముఖంలో ఆశ్చర్యం కనబడింది. అతనేమీ అర్థంకానట్లు ఇద్దరి ముఖాలూ మార్చిమార్చి చూశాడు.

"బావా నువ్వు నా చెల్లెలికి మర్యాదలు నేర్పలేదు. అన్నగారినే అనుకో. అయినా ఇంటికి వచ్చేక కాస్త కాఫీనీళ్ళయినా ఇచ్చిందేమో అడుగు" అన్నాడాగంతకుడు నిష్ఠూరంగా.

"ముక్కూ మొగం తెలియని మగవాడొచ్చి—మీరు లేరన్నాకూడా వినకుండా ఇంట్లో తిష్ఠవేసుక్కూర్చుంటే నేనేంచేసేది చెప్పండి. పక్కింటావిణ్ణి పిలిచి కబుర్లాడుతూ కూర్చున్నాను. ఆవిణ్ణి నేనే పిలిచి పనులు చేసుకుంటూ కూర్చుంటే బాగుండదుకదా—అందుకే ఈవేళ టిఫిన్ కూడా చేయలేదు" అంది సీత.

జనార్దనం ఆగంతకుణ్ణి తీవ్రంగా చూసి "మిస్టర్ నువ్వు..." అన్నాడు.

ఆగంతకుడు నవ్వి "మీ ఇంట్లో ఆతిధ్యాన్ని కోరి వచ్చాను. సుమారు రెండు నెలలుంటాను. చుట్టుపక్కల అనుమానం రాకుండా ఉండటానికి నీ భార్యకు అన్నగా, నీకు బావగా వరస కలుపుకున్నాను" అన్నాడు.

ఈ చనువుకు జనార్దనం ఆశ్చర్యపడ్డాడు. "బాగుంది అంతా నీ ఇష్టమేనేమిటి?"

"అనే అనుకోవాలి. అనుకున్న పని పూర్తి చేయడానికి అనుకున్నచోట ఉండడం నా హక్కు" అతను చాలా

నిబ్బరంగా అన్నాడు.

"ఏమిటా అనుకున్న పని?" తీవ్రంగా అడిగాడు జనార్దనం.

"ఏంలేదు. కొన్ని హత్యలు చేయాలి!" చాలా సింపుల్ గా అన్నాడతను.

జనార్దనం తృళ్ళిపడ్డాడు. "మిస్టర్ ఎవర్నువ్వు?"

"నేనెవరైతేనేం_ నా పేరేమైతేనేం. నన్ను హంతకుడుగా గుర్తుంచుకుంటే చాలు."

ఈసారి జనార్దనానికి కోపం వచ్చింది. "హత్యలు చేయదల్చుకున్నవాడివి ఇక్కడికెందుకొచ్చావ్? ఏ హోటల్లోనైనా మకాం పెట్టలేకపోయావా?"

"ఎవరికీ అనుమానం రాకుండా అనుకున్న పనులు పూర్తిచేసుకునేందుకు నీలాంటివాళ్ళ ఇళ్ళే బాగా పనికి వస్తాయి. నా పథకాలను నేనెలా అమలుజరుపుతానో నీ కళ్ళతో నువ్వే చూస్తావ్..."

"అయామ్ సారీ, అలా చూడాలని నేననుకోవడం లేదు. నిన్ను నా ఇంట్లో ఉండనివ్వను."

"వెర్రివాడా నిర్ణయం నాదికానీ నీదికాదని మర్చిపోతున్నావ్. నేనుండాలనుకున్నంతకాలం నువ్వొద్దన్నా ఉంటాను. వెళ్ళిపోవాలనుకున్న రోజున నువ్వు కాళ్ళు పట్టుకు బ్రతిమలాడినా క్షణముండను."

"కాళ్ళుపట్టుకు బ్రతిమలాడే రోజు ముందుందేమో నాకు తెలియదుకానీ ప్రస్తుతానికి నిన్ను నేను మెడపట్టి గెంటబోతున్నాను" అన్నాడు జనార్దనం ఒక అడుగు ముందుకువేసి.

"మంచిది" అని ఆగంతకుడు తనూ ఒక అడుగు ముందుకు వేసి జనార్దనాన్ని సమీపించి నెమ్మదిగా అతనికి మాత్రం వినిపించేలే "లలితారాణి కథ నాకు తెలుసు!" అన్నాడు.

జనార్దనం ముఖంలో గాబరా కనబడింది. అతను భార్య వంక చూసి "సీతా మంచినీళ్ళు!" అన్నాడు. సీత త్వరగా లోపలకు వెళ్ళింది.

ఆగంతకుడు జనార్దనం భుజంమీద తట్టి "చూడు, అనవసరంగా గాబరాపడకు. నేను నిన్ను బ్లాక్ మెయిల్ చేయడానికి రాలేదు. నీ దగ్గర్నుంచి డబ్బునూ ఆశించడం లేదు. నా పనయ్యేవరకూ నీ ఇంట్లో ఉండనీ" అన్నాడు.

సీత వచ్చి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది. జనార్దనం గటగటా మంచినీళ్ళు తాగేశాడు. తర్వాత భార్యవంక చూసి "సీతా చాలా ఆకలిగా వుంది. ఏదైనా టిఫిన్ చేయి. ఏంచేసినా నీ అన్నయ్య మెచ్చుకునేలా ఉండాలి సుమా" అన్నాడు.

సీత తెల్లబోయి భర్తవంక చూసింది. తర్వాత ఆమె నెమ్మదిగా వంటింట్లోకి వెళ్ళింది.

3

శాస్త్రగుస్వరంతో జనార్దనానికీ, ఆగంతకుడికీ సంభాషణ నడుస్తోంది.

"ఎన్నాళ్ళుంటావ్? మా ఇంట్లో..." అన్నాడు జనార్దనం.

"ప్రస్తుతం వేసుకున్న అంచనా ప్రకారం రెండునెలలనుకుంటున్నాను. ఒక్కోసారి అంచనాలు తారుమారవుతుంటాయి. వెళ్ళడానికి వారం రోజుల ముందు తెలియబరుస్తానే!" అన్నాడాగంతకుడు.

"ఏమిటి నీ పని!"

"చెప్పానుగా హత్యలు చేయడం!" అన్నా డాగంతకుడు. "నేనేం చేస్తున్నానో నా పనులేమిటో మీరు పట్టించుకోకూడదు. నాకోసం ఒక గది మీరు కేటాయించాలి. రోజూ ఉదయంపూట శుభ్రపర్చడానికి తప్పితే ఆ గదిలోకి మీ రెవ్వరూ రాకూడదు."

జనార్దనం నిట్టూర్చాడు. ఇలా ఒక ఆగంతకుడు వచ్చి తనింట్లో ఏకు మేకై కూర్చుంటాడని అత నెన్నడూ అనుకోలేదు. అతను నిస్సహాయంగా ఆగంతకుణ్ని చూసి "లలితా రాణి కథ నీకెలా తెలుసు!" అన్నాడు.

"నాయనా మాకూ యూనియన్ ఉంది. ఆ యూనియన్లో ఇలాంటి రహస్యాలు కొన్ని లక్షలుంటాయి. అవసరానికి వాడుకుంటూంటాం."

"ఇప్పుడు నువ్వెక్కణ్ణించి వస్తున్నావ్!"

"కోటీశ్వర్రావు తెలుసుగదా నీకు..."

"ఏ కోటీశ్వర్రావు..."

"రైస్ మిల్ ఓనర్..."

"ఓహ్ ఆయనా?" ఉలిక్కిపడ్డాడు జనార్దనం. "ఆయన హత్యచేయబడి ఇంకా వారంరోజులు కాలేదు."

"ఆఁ అదే. ఆ హత్య నేనే చేశాను" అన్నాడు ఆగంతకుడు తాపీగా. "కానీ, దురదృష్టవశాత్తూ అది ఒకడి కళ్ళబడింది. వాడు నన్ను చూశాడు. కోటీశ్వర్రావు హత్య కేసులో అనుమానంమీద ఒకణ్ని అరెస్టు చేశారు. వాడు పాత నేరసుడే. రెండుమూడు హత్యలుచేసి తప్పించుకోగలిగాడు. ఎప్పటికైనా ఉరికంబం ఎక్కవలసినవాడే. ఇప్పుడిలా ఎక్కితే కనీసం నన్ను రక్షించినట్లవుతుంది

గదా అని అనుకున్నాను. అయితే, నన్ను చూసినవా డొకడున్నాడు గదా - వాడి పని పూర్తి చేస్తే కానీ నాకు తృప్తిగా వుండదు. చేసి నన్ను హంతకుడిగా నిరూపించడానికి వాడు ప్రయత్నిస్తాడని నేననుకోవడంలేదు. కానీ ఋణశేషం, శత్రుశేషం వుంచకూడదని పెద్దలంటారు. సాయింట్లో మకాం పెట్టి నేను చేయబోయే మొదటి హత్య అదే!''

జనార్దనం కంగారుపడ్డాడు. ఆ మనిషి చాలా ప్రశాంతంగా వున్నాడు. పిడుగుల్లాంటి మాటలు చాలా సావధానంగా అంటున్నాడు. ''మొదటి హత్య అంటే-ఇంకా ఎన్ని హత్యలు చేద్దామని!?''

''లెక్క వేసుకోలేదు. ప్రస్తుతానికి మరో మూడున్నాయి లిస్టులో. కానీ, అవసరాన్నిబట్టి మరికొన్ని చేయాల్సి రావచ్చు. ఉదాహరణకు కోటీశ్వరరావుని చంపినప్పుడు ఆ హత్య ఇంకొకడు చూస్తాడని నేననుకోలేదు. కానీ, ఇంకొకడు చూశాడు. ఒకటనుకున్నది - రెండు హత్యలు చేయాల్సొచ్చింది!'' జాలిపడుతున్నట్లుగా అన్నాడాగంతకుడు.

జనార్దనానికి గుండెలదిరాయి. తనజీవితం ప్రమాదంలో పడినట్లతనికి తోచింది. అత నాలోచిస్తూండగా సీత ఉప్మా ప్లేట్లతో వచ్చింది, ఇద్దరూ టిఫి నారగించారు.

''చెల్లాయింత రుచిగా చేసే మాటయితే, నేనిక్కడ ఏళ్ళతరబడి వుండిపోవాల్సొంటుంది'' అన్నాడతను.

జనార్దనా న్నామాటలు మరింత భయపెట్టినా అతను తరచుగా సీతను చెల్లాయనడం కొంత ధైర్యాన్నిచ్చింది. కనీసం ఈ వరసైనా కొంత ఆత్మీయతను కలిగించి ఈ

హంతకుడు తమ జోలికి రాకుండా చేస్తుందని ఆశ కలిగిం దతనికి.

"సీతా-మీ అన్నయ్యకి ఓ గది ఖాళీ చేసివ్వాలి. ఆ ఏర్పాట్లు చూస్తావా? అందుకు నా సాయమేదైనా కావాలా?" అన్నాడు జనార్దనం.

ఆగంతకుడు లేచాడు. "నేను మళ్ళీ రాత్రి ఎనిమిది న్నరకు వస్తాను. అప్పటికన్నీ సిద్ధంగా వుంచండి. నేను కూడా ఆట్టే సామాను తెచ్చుకురావడంలేదు. అందుకని నిత్యావసర వస్తువులకోసం పదేపదే మీ గదుల్లోకి రానవ సరం లేకుండా, హోటల్ గదిలా అన్ని ఏర్పాట్లూ చేయండి. ఒక మంచం, దుప్పటీ, రెండు తలగడలు, కప్పుకోడానికి మరో దుప్పటీ వుంటే పక్క కు సంబం ధించినంతవరకూ ఏర్పాట్లు చాలు. ఓ కూజా, నిండా నీళ్లు- పక్కనే ఒక గ్లాసు. ఇవికాక అద్దం, దువ్వెన, కొబ్బరి నూనె సీసా, సబ్బు, తువ్వాలు ప్రస్తుతానికి నాకు గుర్తున్న వివే..."

"బ్రష్షూ, పేస్టూ..." అంది మంటగా సీత.

"అవసరంలేదు. అవీ, టంగ్ క్లీనరూకూడా నేనే తెచ్చుకుంటున్నాను. రాత్రికి భోజనంకూడా చేసి వచ్చే స్తాను. నా కోసం మీ రింకే ఏర్పాట్లూ చేయ నవసరం లేదు. వచ్చి తిన్నగా గదిలోకి వెళ్ళి పడుకుంటాను. కానీ, ఒక చిన్న హెచ్చరిక. నా గురించి పోలీసులకి చెప్పడానికి ప్రయత్నించినా, ఏదో విధంగా నన్ను పట్టించడానికి నా మీద డిటెక్టివులని నియమించినా మీ చావు మీరే కొని తెచ్చుకున్నట్లవుతుంది. కోపంవస్తే నాకు దయా దాక్షిణ్యా లుండవు. వస్తాను మరి" అంటూ వెళ్ళిపోయా డతను.

4

గది ఒకటి ఖాళీచేసి ఏర్పాట్లుచేస్తున్నంతసేపూ సీ విసుక్కుంటూనే వుంది. "మనం పెద్దిల్లు తీసుకున్నది వీ కోసమేలాగుంది" అందామె కసిగా.

"బాగుంది. వీడికోసమెందుకవుతుంది. కోరి నాకు అర్ధాంగిగా వచ్చిన కోటీశ్వరుడి పుత్రికను ఎలా చూసుకోవాలో నాకు తెలుసు. నాకు తెలిసినవిధంగా చూసుకునే స్తోమత నాకుంది. ఈ ఇల్లు నీ భర్త జీతాన్నీ, హోదానీ చెప్పక చెబుతుంది" అన్నాడు జనార్దనం గర్వంగా.

"మీరు మీ హోదాని గుర్తుచేసుకుని సంబరపడుతున్నారు. నా ఆలోచనలన్నీ వాడిగురించే—వాడు మనింట్లో కొన్ని మాసాలుంటాడంటే నా ఒళ్ళు కంపరమెత్తిపోతోంది. క్షణంకూడా వాణ్ని నేను భరించలేను. పైగా చెల్లాయంటూ పిలుపొకటి. నా కన్నయ్యాలు లేకపోవచ్చు కానీ ఇలాంటి వెధవని అన్నయ్యగా భరించడం నావల్ల కాదు. పైగా మీరు కూడా ఆ వెధవతో చేతులు కలిపి మీ అన్నయ్య మీ అన్నయ్య అంటున్నారు" అంది సీత ఉక్రోషంగా.

జనార్దనం సీతవంక బాధగా చూశాడు. "చూడు సీతా మనం విధి చేతిలో కీలుబొమ్మలమన్న సంగతి నీకు పదేపదే గుర్తుచేయనవసరంలేదు. వాణ్ని మనం ఏమీ అనలేము. వాడొక నరరూప రాక్షసుడు. నరహంతకుడు. వాడితో గొడవ పెట్టుకుంటే మనని బ్రతకనివ్వడు. ఇలాంటివాళ్ళను తెలివిగా వదుల్చుకోవాలి."

"పోనీ పోలీసులకి చెప్పేస్తే..."

"విన్నావుగా — వెళ్ళేముందు వాడి హెచ్చరిక"

అన్నాడు జనార్దనం. "అన్నంతపనీ చేస్తాడు వాడు."

"బాగుంది...అంత్యనిష్ఠూరంకంటె ఆదినిష్ఠూరం మేల న్నాడు. వీణ్నిప్పుడు నెత్తికెక్కించుకుంటే తర్వాత వదుల్చుకోవడం కష్టంకావచ్చు. ఇలాంటివాడితో కల కాలం వేగడమూ కష్టమే కాబట్టి ఏదోక్షణంలో వీడితో గొడవపడకా తప్పదు. అప్పుడైనా వీడు మనల్ని చంపుతా ననకా మానడు. అందుకని బాగా ఆలోచించి ఇప్పుడే వీణ్ని వదుల్చుకునే సాధనం చూడండి" అంది సీత.

"నువ్వు చెప్పిందీ నిజమే" అన్నాడు జనార్దనం. కోటీశ్వర్రావు హత్యను చూసిన నేరానికి ఒకణ్ని చంప బోతున్నట్లు చెప్పాడు వాడు. అలాగే తనకూ కొన్ని రహస్యాలిప్పటికే తెలిశాయి. ముందుముందింకా తెలియ వచ్చు. అటువంటప్పుడు తమను మాత్రం వదిలిపెడతా డన్న గ్యారంటీ ఏమిటి? తలచుకుంటేనే జనార్దనానికి గుండెలు జలదరించాయి. అతను క్షణం ఆలోచించి "సీతా! వీడిని వదుల్చుకోవాల్సిందే. కానీ ఆ పని మంచిగానే చేయాలి. ఇలాంటి సమయంలో మీ నాన్నగారిలాంటివాడు మన కండగా ఉండి ఉన్నట్లయితే చాలా బాగుండేది!" అన్నాడు.

సీత కనుకొలకుల్లో నీళ్ళు నిలిచాయి. "దయవుంచి ఆయన ప్రసక్తి తీసుకురాకండి. నాకో తండ్రి వున్నాడని గుర్తుచేయకండి. ఇంకే ఉపాయాలైనా ఆలోచించండి" అంది.

జనార్దనం నిట్టూర్చాడు. సీత తండ్రి శంకర్రావు కోటీ శ్వరుడు. సీత ఆయన ఏకైక సంతానం. సీత తనను ప్రేమించడం ఆయన కేమాత్రమూ ఇష్టంలేదు. కానీ

ఆయన ఇష్టాన్ని వ్యతిరేకించింది సీత. తనమాట కాదం ఇంట్లోంచి పొమ్మన్నాడామెను. అలాగేనని తనతో వ: సింది సీత. గుళ్ళోనే అయినా తమ వివాహం వైభవం జరిగింది. వివాహమైన ఆర్నెల్లకు సీత తండ్రి ఆమె ద రకు వచ్చి ఆమె జీవితం చూసి బాధపడ్డాడు. జనార్ద నికి విడాకులిచ్చేస్తే ఆమెకు ఒక గొప్పవాడితో మ! వివాహం జరిపిస్తానన్నాడు. ఆమె జీవితాన్ని సుఖమయ చేయాలన్నది తన తపన అన్నాడు. ఆమె ఆయన మాటఽ వినకపోయేసరికి జనార్దనాన్ని చంపిస్తానని బెదిరించాడు సీత రెచ్చిపోయి 'నా భర్త మరణించిన మరుక్షణం నేను శవంగా మారుతానన్న సంగతి మీరు గుర్తుంచుకోండి మిమ్మల్ని... ఈ మాటలన్న మిమ్మల్ని... ఇంక నాన్నా అని పిలవలేను. వెళ్ళిపోండి. ఇంకెప్పుడూ నన్ను కలుసుక నేందుకు ప్రయత్నించకండి'' అనేసింది.

అప్పటికి జనార్దనం సామాన్యమైన ఉద్యోగం చేస్తు న్నాడు. కానీ శంకర్రావు సీత జీవితం చూసి జాలిపడడం అతనికి తల తీసేసినట్లయింది. అతను కష్టపడి మంచి ఉద్యోగం కోసం నానాప్రయత్నాలూ చేయసాగాడు. ఆ సందర్భంలోనే అతనికి లలితారాణి పరిచయమైంది. పరిచయం ఊరికేపోలేదు. అతనికొక పెద్ద కంపెనీలో పదిహేనువందల రూపాయల జీతంమీద ఉద్యోగం దొరి కింది. అప్పట్నించీ అతను సీతను సుఖపెట్టడమే ధ్యేయంగా ఉంటున్నాడు. ఇది జరిగి సంవత్సరానికి పైగా అయింది.

సీత కోటీశ్వరుడి ఇంట పుట్టినప్పటికీ, ఆమె విలాసవతి కాలేదు. ఆమెకు చెడుఅలవాట్లు లేవు. ఆమె కోరుకునేది

మనసారా ప్రేమించే మనుషులను. మోసం, ద్వేషం అన్న పదాలామె కామడదూరంలో ఉంటాయి. ఆమె దుబారా ఖర్చులు చేయదు. అవసరానికి మించిన పనివాళ్ళను పెట్టుకోలేదు. చిన్నతనంనుంచీ అలవాటైన కారణంగా ఆమె తనకో రకమైన యిల్లు కోరుకుంది. ఆ యింటి నామె స్వయంగా అందంగా అలంకరించి ఉంచుతుంది.

జనార్ధనానికి సీతతో కాపురం చాలా హాయిగా వుంటోంది. భౌతికంగాను, మానసికంగానూ అందమైన భార్య లెంతోమంది మగవాళ్ళకు లభించరు. చక్కగా నడిచిపోతుందన్న జీవితంలోకి, ఈరోజే ఒక దుర్మార్గుడు ప్రవేశించాడు. వాడి పీడ ఎలాగో అలా వదలించుకోవాలి?

"ఈ రాత్రికి వాడెలాగూ ఇక్కడుండడం తప్పదు' రెండుమూడ్రోజుల్లో ఏదో ఒక పథకం వెయ్యాలి. తెలివిగా వాడిని బయటకు పంపించాలి......" అన్నాడు జనార్ధనం.

జనార్ధనం ఆలోచనలు ఒక రూపానికి వస్తున్నాయి.

ఇద్దరూ భోజనాలుచేసి హంతకుడి రాకకోసం వీధిగదిలో కూర్చుని ఎదురుచూస్తున్నారు. అన్న టైముకి ఠంచనుగా వచ్చాడు హంతకుడు. అతని చేతిలో ఒక సూట్ కేస్ మాత్రం వుంది. లోపలికి వస్తూనే అతను వుత్సాహంగా "చెల్లాయ్ మీ భోజనాలైపోయాయా? నీ చేతి ఉప్మా రుచిచూశాక భోజనం కూడా ఇక్కడే చేయాలనిపించిందమ్మా! కానీ ఈరోజుకు నాకా అదృష్టం లేదు" అని అతను హఠాత్తుగా దీనంగా అయిపోయాడు. "జీవితంలో నాకెవ్వరూ లేరు. అభిమానాలకూ, ఆప్యాయతలకూ నోచుకోలేదు. ఎందుకో నిన్ను చెల్లాయని పిలు

స్తూంటే అంతులేని ఆనందం కలుగుతోంది. ఏదో జన్మాను బంధముండి ఉండాలి మనిద్దరకూ."

అతని మాటలకు సీత చలించింది. రవంత అతని మీద జాలికూడా కలిగింది. జనార్దనానికి మాత్రం అతనటిన్నించి నరుక్కువస్తున్నాడని అర్థమైపోయింది. సీతను నెమ్మదిగా మంచి మాటలతో లోబరచుకుని ఈ ఇంట్లో తన స్థానాన్ని పటిష్టం చేసుకుందామనుకుంటున్నాడని గ్రహించాడతను.

"నీకు గది సిద్ధమైపోయింది" అన్నాడు జనార్దనం.

"అయితే ఇప్పుడు నా ప్రయాణం సరాసరి గదిలోకే-దారి చూపిస్తావా?" అన్నాడు హంతకుడు. జనార్దనం ముందుకు నడుస్తూంటే హంతకుడు వెనుక నడిచాడు. సీత వెళ్ళి వీధి తలుపులు వేసింది. ఆమె కూడా హంతకుడి కేర్పాటుచేసిన గదిలోకి వెళ్ళేసరికి హంతకుడు గదిని చూసి సంతృప్తిని వ్యక్తపరుస్తున్నాడు.

"చాలా బాగుంది- నాకింక మీతో ప్రమేయంలేదు. ఈ గదితలుపులు దొడ్లోకివున్నాయి కాబట్టి పగలు నేనలా దొడ్డి వేపు తలుపులు వేసుకుని వెళ్ళిపోవచ్చు. ఎటొచ్చీ మీ రనవసరపు టనుమానాలేమీ పెట్టుకోకుండా రాత్రిళ్ళు కూడా, దొడ్డితలుపులు గడియ వేయకుండా జార్లవేసి మాత్రం వుంచండి" అన్నాడు హంతకుడు.

"అలా చేయడం ప్రమాదం. ఈ ఊళ్ళో దొంగల భయం బాగా ఎక్కువ" అన్నాడు జనార్దనం.

"నేనుండగా నీకూ, చెల్లాయికీ ఏం భయంలేదు బావా-ధైర్యంగా వుండండి. ఎవరైనా ఈ ఇంట్లో అడుగు పెట్టారో వాళ్ళ గతి ఏమవుతుందో తెలుసుకోవాలంటే చూడండి" అంటూ అతను తన సూట్ కేస్ ఓపెన్

చేశాడు. సీత, జనార్దనం కుతూహలంగా చూశారు. సీతకు సంబంధించినంతవరకూ ఒక రివాల్వర్, కత్తి కనబడ్డాయి. జనార్దనా న్నాకర్షించిన మూడో వస్తువులో సీతకు ప్రత్యేకత కనబడలేదు.

అది లలితారాణి ఫొటో!

5

మధ్యాహ్నం రెండుగంటల ప్రాంతంలో సీత, ఎవరో తలుపుతట్టిన చప్పుడు విని, వెళ్ళి తలుపులు తీసింది. ఆ ఆగంతకుడెవరో ఆమెకు తెలియలేదు.

"మీ ఇల్లు సోదా చేయాలి!" అన్నాడతను.

"ఎవరు మీరు?" అంది సీత.

"అది మీ రడగకూడదు_నేను చెప్పకూడదు" అన్నాడతను.

"అయితే నేనసలు తలుపులు తియ్యనే తియ్యకూడదు" అంటూ అతను వీధిగుమ్మంలో వుండగానే తలుపులు వేసేయబోయింది సీత.

"ఆహా_ఆగండి" అంటూ అతను బలవంతంగా లోపలకు వచ్చి, "నేను ప్రమాదకరమైన వ్యక్తినీ కాదు, దొంగనూ కాదు. ఒక ముఖ్యమైన విషయంలో ఈ వీధిలోని ఇళ్ళన్నీ సోదాచేస్తూ మీ ఇంటికీ వచ్చాను" అన్నాడు.

"బాగుంది _ అలాగైతే మీరు సాయంత్రం రండి. అప్పుడు నా భర్త ఇంట్లో వుంటారు" అంది సీత.

"సాయంత్రందాకా ఆగడానికి వీల్లేదు. ఇప్పుడే అర్జంటుగా సోదాచేయాలి" అంటూ అతను చాలా కంగారుగా లేచి లోపలకు వెళ్ళబోయాడు.

"లోపలకు వెళ్ళవద్దు-దొంగ దొంగ అని పెద్దగా అరుస్తాను..." అంది సీత.

"అరుస్తావేం?...అరిస్తే చస్తావ్" అతను హఠాత్తుగా చిన్న బాకు తీశాడు.

సీత నివ్వెరపోయింది. ఒక్క క్షణంలోనే తమాయించుకుని, "ఏమిటీ దౌర్జన్యం - ఇంట్లో మగవాళ్ళు లేరనుకుంటున్నావేమో, మా అన్నయ్యున్నాడు" అంది. ఆ క్షణంలో హంతకుడామె కాపద్బాంధవుడిలా తోచాడు.

"ఉన్నాడా - ఉంటే మరీ మంచిది. నా పని మరింత సుకరమవుతుంది" అన్నాడతను.

"అయితే చేసుకో నీ పని సుకరం, నేను వచ్చాను" అన్న మాటలు విని ఉలిక్కిపడి ఇద్దరూ అటువైపు చూశారు. హంతకుడక్కడ నిలబడి నవ్వుతున్నాడు.

కొత్త ఆగంతకుడు బాకును జేబులో పడేసుకుని, "ఇలా వచ్చి కూర్చోండి - మీతో రెండు ముక్కలు మాట్లాడాలి" అన్నాడు.

"చిత్తం - అలాగే చేస్తాను" అంటూ హంతకుడు వెళ్ళి కుర్చీలో కూర్చున్నాక ఆగంతకుడుకూడా తనూ ఇంకో కుర్చీలో కూర్చుని, "మీ ఇల్లు సోదాచేయాలి? ఆ విషయం అంగీకరించకపోవడంవల్లనే మీ చెల్లాయిని బాకు చూపించి బెదిరించాల్సి వచ్చింది" అన్నాడు.

"ఎందుకు మా ఇల్లు సోదాచేయడం? ఇల్లు సోదా చేస్తామంటే ఎవరుమాత్రం ఒప్పుకుంటారు? చెల్లాయి రైటే చేసింది. మీ రెవరో మీ పని ఏమిటో చెప్పండి..." అన్నాడు హంతకుడు కాస్త తీవ్రంగా.

"చెప్పక తప్పేలా లేదు" అన్నాడా ఆగంతకుడు.

"ఈ వీధిలో ఒక నరహంతకుడు మకాం పెట్టినట్లు మాకు సమాచార మందింది. వాడు పరమ దుర్మార్గుడు. వాడి నెలాగో అలా పట్టుకోవాలని శతవిధాలుగా ప్రయత్నిస్తున్న మాకీ సమాచారం అదృష్టవశాత్తూ లభించింది."

"అలాగా - అయితే ఈ ఇల్లు మీరు సోదా చేయడం అనవసరం. ఆ మకాం చేసేవాడు మాకు తెలియకుండా యిక్కడుండడు కదా" అన్నాడు హంతకుడు.

"అలాగనకండి-ఒకోసారి అనుకోకుండా సమాచారం లభించవచ్చు. ఉదాహరణకు మీ రీవిడకు అన్నయ్య నంటున్నారు. కానీ కాకపోవచ్చు. ఈవిణ్ణి బెదిరించి ఈ ఇంట్లో ఉంటూండవచ్చు" అన్నాడా ఆగంతకుడు.

ఈ మాటలు వింటూనే సీత కళ్ళు మెరిశాయి. దేవుడు తమ మొర విని ఈ మనిషిని పంపించాడా అనుకుందామె. అతనికి నిజం చెప్పి హంతకుడి బారినుంచి తప్పించుకోవాలనుకుందామె. అయితే వెంటనే ఆ పని చేయడానికి ధైర్యం చాలలేదు.

"ఇంతకీ తమరెవరు స్వామీ!" అన్నాడు హంతకుడు.

"ప్రభుత్వ ఇంటెలిజెన్సు శాఖ మనిషిని!" అన్నాడతను.

"ఓహో - తమరు సీ. ఐ. డీ. అన్నమాట" అంటూ హంతకుడు నవ్వి, "నాకూ సమాచారం వచ్చింది. ఈ మధ్య ఓ దొంగ బయల్దేరాడట. సీ. ఐ. డీ. నని చెప్పి ఇళ్ళలో చొరబడి అందినవి పట్టుకుని పోతున్నాడట!" అన్నాడు.

సీ. ఐ. డీ. ముఖం ఇబ్బందిగా పెట్టి, "ఏది యేమైనా నేను వచ్చిన పని ముగించకుండా వెళ్ళను. మీరు నన్నాప

లేరు'' అంటూ కుర్చీలోంచి లేచాడు.

"నన్ను మీరూ ఆపలేరు. ముందు మీ ఐడెంటిఫికేషన్ చూపించనిదే నేను మిమ్మల్ని అడుగు ముందుకు వెయ్యనివ్వను సరికదా - పోలీసులకు పట్టిస్తాను'' అన్నాడు హంతకుడు.

"నన్ను పోలీసులకు పట్టివ్వడమా. అది మీవల్ల కాదు. అంతగా అవసరమనుకుంటే మీ యిల్లు సోదా చేయడానికి పోలీసుల్నే సాయంగా పిలవగలను'' అన్నాడు సీ. ఐ. డీ.

"అలాగా_అయితే మరి నన్ను సాయంగా పిలవలేదేం?'' అన్నాడు వెటకారంగా హంతకుడు.

"మీరు పోలీసు మనిషి కాదు గదా.''

"నేనెవరో ఇది చూసి తెలుసుకోండి'' అంటూ హంతకుడు సీ. ఐ. డీ. కి ఒక కార్డు చూపించాడు. సీ. ఐ. డీ. అది చూసి తొట్రుపడి, "అయితే మీరూ, నేనూ కొలీగ్సన్నమాట. అయితే ఇంకేం_మన పని మరింత సుకర మవుతుంది!'' అన్నాడు.

కార్డు తిరిగి జేబులోకి తోసేసి, "మనమిద్దరమూ కొలీగ్సు కావచ్చు. కానీ, నాకు సంబంధించినంతవరకూ ఈ వీధిలో హంతకుడు మకాం పెట్టిన వార్త డిపార్టు మెంటుకు వచ్చినట్లు తెలియదు'' అన్నాడు.

"వచ్చింది లెండి. కానీ, మీరున్న ఇల్లు సోదా చేయడం అనవసరం'' అంటూ వెళ్ళిపోయాడు సి. ఐ. డీ.

అతను వెళ్ళిపోయాక హంతకుడు సీతకేసి చూసి నవ్వి, "చెల్లాయ్_నిజంగా నేను పోలీసుమనిషి ననుకునేవు. ఆ వచ్చిన వెధవని బెదరగొట్టి పంపడానికి నేనాడిన నాటకం. ఇలాంటి నాటకాలెన్నాడితే, నా రహస్యాలు

దాచగలను? ఇంతకూ నీకు నిజం తెలిసిందో లేదో, ఆ వచ్చినవాడు సి. ఐ. డీ. కాదు. ఆ పేరుతో వచ్చిన దొంగ వెధవ. నేను లేకుంటే ఇల్లు దోచివెళ్ళి పోయుండేవాడు" అన్నాడు.

నిజమే ననిపించింది సీతకు. వాడు తన్ను బాకు చూపి బెదిరించాడుకూడా. కాంతయ్యడిమీద మరికాస్త గౌరవం కలిగింది సీతకు.

6

జనార్దనం ఇంట్లో అడుగుపెట్టగానే, "రా–బావా!" అన్నాడు కాంతయ్యడు.

జనార్దనం యిబ్బందిగా ముఖంపెట్టి, "నువ్వింకా యింట్లోనే వున్నావా?" అన్నాడు.

"అయ్యో - అన్నప్రకారం ఇంకా నేను వెళ్ళవలసిన టైము రాలేదే? ఈ ఇంట్లో నేను అన్నకంటె యెక్కువే కానీ, తక్కువరోజా లుండదల్చుకోలేదు" అన్నాడు కాంతయ్యడు.

"అదే నాకూ సంతోషం" అన్నాడు జనార్దనం అదోలా.

"అందుకే–అందుకే. దొరక్క దొరక్క నాకో చెల్లీ, బావా దొరికారు. ఇంకే విధంగానూ చేతకాకపోయినా ఇలాగైనా మిమ్మల్ని సంతోషపెట్ట గలుగుతున్నాను" అన్నాడు కాంతయ్యడు.

జనార్దనం కాంతయ్యడితో యేం మాట్లాడకుండా, "సీతా!" అని అరిచాడు.

"వస్తుందిలే బావా! చాలా భయపడింది తనీ రోజున" అన్నాడు కాంతయ్యడు.

"ఏం జరిగింది?" జనార్దనం కంగారుగా అడిగాడు.

జరిగింది చెప్పడం హంతకుడు ముగించేసరికి సీత వచ్చి, "పొరుగింటావిడతో కబుర్లు చెబుతున్నాను. మీరు వచ్చి నట్లే తెలియలేదు" అంది.

"మధ్యాహ్నం మనింటికి సీ. ఐ. డీ. వచ్చేడా?" అనడిగేడు జనార్దనం.

"వాడు సీ. ఐ. డీ. ఏమిటి బావా - ఎవడో దొంగ వెధవ. అయినకాటికి అంకించుకుందామని వచ్చాడు. నే నుండడంతో వాడి ఆటలు సాగలేదు" అన్నాడు హంతకుడు.

జనార్దనం హంతకుడి వంక ఆశ్చర్యంగా చూసి, "నీకు భయంగా లేదూ, ఒకవేళ వాడు నిజంగా సీ. ఐ. డీ. యేమోనని! వాడు సీ. ఐ. డీ. అయుంటే నువ్వు పట్టుబడే అవకాశాలింకా పెరిగిపోయినట్లు లెక్క!" అన్నాడు.

హంతకుడు నవ్వి, "వాడెవరో, ఎందుకొచ్చాడో నాకు వివరంగా తెలుసు!" అన్నాడు.

"టిఫినేం చేయమంటారు?" అంది సీత.

"ఈరోజు నీ వంట చవిచూశాను చెల్లాయ్! నువ్వడగక్కర్లేదు. ఏం చేసినా బాగానే వుంటుంది" అన్నాడు హంతకుడు.

"పకోడీలు వేస్తాను" అని ఇద్దరివంకా అనుమతికోసం చూసి అక్కణ్ణించి వెళ్ళిపోయింది సీత.

"ఎవరంటావు వాడు?" కుతూహలంగా అడిగాడు జనార్దనం.

"నిజంగా తెలియకుండానే అడుగుతున్నావా?" అదోలా అన్నాడు హంతకుడు. "సరే-అయినా అడిగావు

కాబట్టి చెబుతున్నాను. వాడు నువ్వు నన్ను బెదరగొట్టాలని పంపిన మనిషి..."

"అబద్ధం" అన్నాడు జనార్దనం వెంటనే. కానీ, అతని ముఖంలో భయం స్పష్టంగా కనబడుతోంది.

"బుకాయించవద్దు. అన్నీ నే నూహించగలను. నిన్న నేను మీ యింట్లో మకాం పెట్టాను. ఈరోజు మీ ఇంట్లో హంతకుణ్ణి వెతుక్కుంటూ సీ. ఐ. డీ. వచ్చాడు. వెంటనే గ్రహించాను నేను—ఇది నీ పనయ్యుంటుందని. సీ. ఐ. డీ. ల కనుమానం తగిలిందని తెలిస్తే, బెదిరిపోయి పారిపోతా ననుకున్నావు. కానీ, నేను నువ్వూహించిన రకం మనిషిని కాదు" హంతకుడు ఆగి, "నేను మొదట్లోనే నిన్ను హెచ్చరించాను. నన్ను రెచ్చగొట్టడం ప్రాణాలతో చెలగాటమేనని" అన్నాడు.

జనార్దనం మరింత భయపడ్డాడు. అతను నెమ్మదిగా, "పొరబాటయింది" అన్నాడు తల వంచుకుని.

"పొరపాటున ఉప్పు పాలలో పడితే, విరిగిన ఆ పాలను మళ్ళీ అతికించడం కష్టం. పొరపాటున విషం మింగితే, పోయిన ఆ ప్రాణాలింక తిరిగిరావు. నా విషయంలో పొరపాటు చేయడం అంతకంటె ప్రమాదకరం. అయినా నీ మొదటి తప్పును క్షమించాను. ఎటొచ్చీ, ఇంక క్షమించను."

జనార్దనం తల వంచుకునే, "నేను వివరాలేమీ చెప్ప లేదు. మా ఇంటికి వెళ్ళి ఈ మాటలు చెప్పి రమ్మన్నాను. మా యింట్లో హంతకుడున్నాడని అతనికి చెప్పలేదు" అన్నాడు.

"మంచిది. లలితారాణి మనిషికి అంతకంటె ఎక్కువ

సమాచార మివ్వడం మంచిపని కాదు!" అన్నాడు హంతకుడు.

ఆశ్చర్యంగా చూశాడు జనార్దనం అతనివంక - యెవ రితను? ఇన్ని వివరాల నెలా సంపాదించగల్గుతున్నాడు?

7

"వాడు మీరు నియమించిన మనిషా? వాడు బాకు తీసేసరికి నాకెంత భయంవేసిందో చెప్పలేను. సమయానికి మన అతిథి ఆపద్బాంధవుడిలాగొచ్చా డనిపించింది" అంది ఆశ్చర్యంగా సీత.

"హంతకుణ్ణి వదిలించుకుందామని నేను వేసిన మొదటి ప్లాను భగ్నమయింది. అతను నన్ను చాలా తీవ్రంగా హెచ్చరించాడు. ఇలాంటి పొరపాటు మళ్ళా జరిగితే ప్రాణాలు దక్కవని చాలా గట్టిగా చెప్పాడు" అన్నాడు జనార్దనం నిట్టూరుస్తూ.

"ఇంక మనం వాడి జోలికి వెళ్ళవద్దండీ. హంతకుడి నంటున్నప్పటికీ మనిషి మంచివాడిలాగే కనిపిస్తున్నాడు. ప్రవర్తనకూడా మెచ్చుకోదగ్గ విధంగా వుంటోంది. తనెవరైతేనేం - ఏంచేస్తేనేం - మన జోలికి రానంతకాలం, వాడి జోలికి మనమూ వెళ్ళవద్దు" అంది సీత.

"అవుననుకో. కానీ, ఇంట్లో తిరుగుతున్న పాము ఏదో రోజున మననీ కాటువేయదని నమ్మకమేమిటి?" అన్నాడు జనార్దనం.

"అదీ నిజమే కానీ, వాడసలు పామే కాదేమో! తను నిజంగా సీ. ఐ. డీ. యేమో. ఆ పేరుతో వుండడం ఇష్టం లేక, హంతకుడన్న పేరుతో మనింట్లో వుండదల్చుకున్నా డేమో. మనిషినీ, మనిషి ప్రవర్తననూ గమనిస్తూంటే,

ఏదో సదుద్దేశ్యంతో మనింట్లో మకాం పెట్టినట్లుంది తప్పితే మరోవిధంగా అనిపించడంలేదు నాకు'' అంది సీత.

జనార్దనం ఆశ్చర్యంగా భార్య ముఖంలోకి చూసి, "మొత్తానికీ హంతకుడు అసాధ్యుడిలాగున్నాడు. నిన్ను బుట్టలో వేసుకున్నాడు'' అన్నాడు.

భార్యాభర్తలిద్దరూ రాత్రి పన్నెండు గంటలవరకూ మెలకువగానే వున్నారు. ఇంట్లోవున్న హంతకుడు వాళ్ళకు మనఃశ్శాంతి లేకుండా చేశాడు. దాంతో వాళ్ళకు నిద్ర పట్టడంలేదు. టైము పన్నెండయేసరికి ఇంక లాభంలేదని మాట్లాడుకోవడం మానేసి ఇద్దరూ కళ్ళు మూసుకున్నారు. కానీ, యిద్దరికీ నిద్రవచ్చే సూచనలు కనబడలేదు.

ఉన్నట్లుండి జనార్దనానికి ఒక ఆర్తనాదం, చావుకేక లాంటిది వినబడింది. చటుక్కున సీత అతనికి మరింత దగ్గరగా జరిగింది. "నీకూ వినిపించిందా ఆ కేక?'' అన్నాడు జనార్దనం.

"మీరూ మెలకువగానే వున్నారా?'' అంది సీత.

"ఊఁ...ఆ కేక మనింట్లోంచే వచ్చింది. ఒకసారి లేచి చూద్దామా?'' అన్నాడు జనార్దనం.

"వద్దండీ'' అంది భయంగా సీత.

జనార్దనం లేచాడు. "ఏమిటో చూడాల్సిందే - నీకు భయంగా వుంటే నువ్వు రాకు.''

"అమ్మో - ఒక్కర్తికీ భయం నాకు. నేనూ మీతో వస్తాను'' అంది సీత.

ఇద్దరూ లేచారు కానీ, గదిలో లైటు వేయలేదు. చప్పుడు కాకుండా తమ గదితలుపులు తీశారు...

హంతకుడి గదితలుపులు బార్లా తెరచివున్నాయి.

గదిలో మంచంమీద ఒకమనిషి వెల్లకితలా పడివున్నాడు. అతని గుండెల్లో కత్తి దిగబడివుంది. ఆ ప్రాంతమంతా ఎర్రగా వుంది. మనిషి అప్పటికే చచ్చినట్లున్నాడు. ఎక్కడా చలనంలేదు. హంతకుడు గదిలో లేడు.

సీత వణికిపోతోంది. జనార్దనం ఆమె వీపు నిమిరాడు కంగారు పడవద్దన్నట్లుగా. అంతలో యిద్దరికీ అడుగుల చప్పుడు వినపడి చీకట్లోకి తప్పుకున్నారు.

హంతకుడు దొడ్డివైపునుంచి గదిలోకి వచ్చాడు. అతను శవాన్ని పరీక్షగా చూసి తృప్తిగా నిట్టూర్చాడు. మనిషి ముఖంలో కసి కనబడుతోంది. చూడ్డానికతను నిప్పుడు భయంకరంగా వున్నాడు.

హంతకుడి గదిలో ఇప్పుడొక ట్రంకుపెట్టె వుంది. హంతకుడు దాని మూత తెరిచాడు. అది చాలా పెద్దసైజు పెట్టె. ఖాళీగా వుంది. హంతకుడు శవాన్ని సమీపించి కాళ్ళు ముడవడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఇంక అక్కడుండడం ప్రమాదమని తోచింది జనార్దనానికి. అడుగులచప్పుడు కాకుండా యిద్దరూ అక్కణ్ణించి నెమ్మదిగా తమ గదిలోకి జారుకున్నారు. గది తలుపులు వేసుకుని మంచంమీద పడుకున్నాక, "నాకు చాలా భయంగా వుంది" అంది సీత.

"భయపడకు. హంతకుడి అసలు స్వరూపం చూశా విప్పుడు నువ్వు - నే నెప్పుడో ఊహించాను" అన్నాడు జనార్దనం.

"ఆ మనిషెవరో పాపం - మనింటి కెప్పుడొచ్చాడో - ఎందుకొచ్చాడో - ఇక్కడిలా అర్థాంతరంగా చావాలని రాసిపెట్టి వుంది" అంది సీత.

"నా అభిప్రాయంలో - హంతకుడే అతన్ని మనింటికి పిల్చుకువచ్చి వుండాలి" అన్నాడు జనార్దనం.

"అంటే హంతకుడికి బాగా తెలిసినవాడై వుండాలి!" అంది సీత.

"హంతకుడికే కాదు. ఆ చనిపోయిన మనిషి నాకూ తెలుసు!" అన్నాడు జనార్దనం. అతని కంఠం బాధగా వుంది.

"ఎవరండీ అతను!" కుతూహలంగా అడిగింది సీత.

"అతని పేరు అనంతం. చాలా చలాకీ అయినవాడు. అప్పుడప్పుడు నాకు క్లబ్బులో కలుస్తూండేవాడు. అనంతానికి హంతకుడితో పరిచయ మెలాగయిందో మాత్రం నాకు తెలియదు..." అన్నాడు జనార్దనం.

"పేపర్లలో హత్యల గురించి చూడ్డమే కానీ, ఇలా కళ్లెదుట ఒక హత్యను చూస్తానని అనుకోలేదు" అంది సీత. ఆమె ఇంకా వణుకుతున్నదని స్పర్శనుబట్టీ, మాటలనుబట్టీ జనార్దనం గ్రహించాడు.

జనార్దనం భార్యను దగ్గరగా లాక్కుని, "జాగ్రత్త! మనకేం భయంలేదు. కానీ, ఈ హత్యను చూసినట్లు పొరపాటునకూడా ఎవ్వరికీ తెలియకూడదు. ముఖ్యంగా హంతకుడికి..."

"ఏం?" అంది సీత.

"హత్య చూసినవాళ్లెవ్వరూ బ్రతికి బయటపడడం హంతకుల కిష్టముండదు" అన్నాడు జనార్దనం. అతను హఠాత్తుగా ఉలిక్కిపడ్డాడు. "ఓహ్-అందుకే యితన్ని చంపేశాడేమోకూడా" అన్నాడు.

సీత కర్థంకాలేదు. "ఏమిటండీ మీ రనేది?" అంది.

"రైస్ మిల్ ఓనర్ కోటీశ్వరరావు హత్య చేయబడ్డాడు. ఆ హత్య మనింట్లో వుంటున్న హంతకుడే చేశాడట. తనే చేశానని వాడు నాకు స్వయంగా చెప్పాడు. ఆ హత్యను ఒకడు చూశాడనీ, వాణ్ణి తను చంపేయదల్చుకున్నాననీకూడా హంతకుడు నాతో అన్నాడు. అనంతానికి కోటీశ్వర్రావుతో పరిచయముంది. అతను తరచుగా కోటీశ్వర్రావింటికి వెడుతూంటాడు. బహుశా అతనీ హత్యను చూసివుంటాడు. అందుకే ఈరోజు మనింట్లో అంత మైపోయాడు."

"అయితే మనమూ చూశామిప్పుడు ఒక హత్య."

"అందుకే ఈ విషయం రహస్యంగా వుంచాలి. ఎవ్వరికీ తెలియనివ్వకూడదు. తెలిస్తే అనంతానికి పట్టిన గతే మనకూ పట్టవచ్చు" అన్నాడు జనార్దనం.

8

"చెల్లాయ్ పాత దుప్పట్లు పోయాయి. ఈ రోజు నా గదిలో కొత్త దుప్పట్లు మార్చాలమ్మా" అన్నాడు హంతకుడు.

"మీ చెల్లాయ్‌కి జ్వరం వచ్చింది" అన్నాడు జనార్దనం.

హంతకుడి ముఖంలో కంగారు కనబడింది. అతను చటుక్కున ఒక అడుగు ముందుకు వేసి ఆమె నుదుటి మీద చేయివేసి చూసి "అరే నుదురు కాలిపోతోంది. వెంటనే డాక్టర్ని పిలుచుకురా బావా!" అన్నాడు.

"అవును నేనూ ఇప్పుడే లేచి తలుపులు తీశాను. నువ్వు వచ్చావు" అన్నాడు జనార్దనం ముక్తసరిగా.

"రాత్రిదాకా బాగానేవుంది. ఇంతట్లో ఏమయింది.

ఏమైనా చూసి జడుసుకుందేమిటి?'' అన్నాడు హంతకుడు.

జనార్దనం ఉలిక్కిపడి హంతకుడి కళ్ళలోకి చూశాడు. అతని కళ్ళలో అనుమానమూ, సన్నని ఎరుపు జీర కనబడుతున్నాయి. "అబ్బే అటువంటిదేమీ లేదు. అయినా ఈ యింట్లో జడుసుకునేందుకేముంది—నువ్వు తప్ప!'' అన్నాడు.

"అదే అదే నన్ను కానీ, నా...'' అర్ధాంతరంగా ఆగాడు హంతకుడు.

"నేను వెళ్ళి డాక్టర్ని పిలుచుకు వస్తాను. పని మనిషి వస్తే ఈలోగా కాస్త గిన్నెలు వేసి పెట్టు'' అన్నాడు జనార్దనం.

డాక్టరు వచ్చి చూసి కంగారు పడవలసిందేమీ లేదనీ దేనికో భయపడినట్లు కనబడుతోందనీ అన్నాడు. డాక్టరు మాటలు విన్నాక హంతకుడి కళ్ళలో మరింత అనుమానం కనబడడం చూసి కలవరబడ్డాడు జనార్దనం. ఏవో టాబ్లెట్సిచ్చి డాక్టరు వెళ్ళిపోయాక "రాత్రి మీకేదైనా కేక వినపడిందా?'' అనడిగాడు హంతకుడు.

"నాకు ఒళ్ళు తెలియని నిద్ర పట్టేసింది. ఏ కేకలూ వినలేదు. ఏమలా అడుగుతున్నావ్?'' అన్నాడు జనార్దనం ఎరగనట్లుగా.

"ఏమీ లేదు. నిద్రలో కలవరించడం నాకు బాగా అలవాటు. ఒకోసారి పెద్ద పెద్ద కేకలు కూడా పెడుతూంటానట. అలాంటి దేదైనా విని చెల్లాయ్ భయపడిందేమోనని...'' అన్నాడు హంతకుడు.

"లేదన్నయ్యా అలాంటి కేకలు నా చెవుల పడవు. నాది మరీ మొద్దునిద్ర'' అంది సీత.

"బావా మీయింటి నుంచి నది ఒడ్డుకు రిక్షా ఏం తీసు కుంటాడు?" అనడిగాడు హంతకుడు.

"ఎందుకు?" జనార్దనం అడిగాడు.

"ఓ రిక్షా బేరమాడిపెట్టాలి. నేనూ ఒక ట్రంకుపెట్టీ ఉంటాయని చెప్పు. ఓ పావలా డబ్బులు ఎక్కువైనా ఫరవాలేదు. ఈ రోజు మళ్ళీ సాయంత్రందాకా రాను" అన్నాడు హంతకుడు.

అతను వెళ్ళడం చాలా అవసరమని తోచి తక్షణం పరుగెత్తుకు వెళ్ళాడు జనార్దనం. క్షణాలమీద రిక్షా కుదుర్చుకుని కూడా వచ్చాడు.

హంతకుడు, జనార్దనం కలిసి ట్రంకును మోసి రిక్షాలో పెట్టారు. మోయడం చాలా కష్టమయింది. అది చాలా బరువుగా వుంది. రిక్షా వెళ్ళిపోయేక జనార్దం భార్య దగ్గరకు వచ్చి ఆమె పొట్టమీద చేయి వేసి చూశాడు. ఇంకా వేడిగానే ఉందామె ఒళ్లు.

"జడుసుకున్నావా సీతా!" అన్నాడతను.

"ఏమోనండీ రాత్రి శవాన్ని చూసేక నాకు చాలా భయం కలిగినమాట నిజం. జడుసుకున్నానని అనుకోలేదు" అంది సీత.

"ఎలాగైనా హంతకుడు మనకు చాలా ప్రమాదకారిలా గున్నాడు. వీడితో మనకు క్షణక్షణగండమే వీణ్ణి బయటకు పంపడానికేదైనా ఉపాయం పన్నాలి. అదీ తిరుగులేనిది" అన్నాడు జనార్దనం.

"ఏమో వీణ్ణి వదల్చుకోగలమని నాకు నమ్మకం కల గడం లేదు" అంది సీత భయంగా.

"ఈ రోజుకి ఆఫీసుకి సెలవు పెట్టేస్తాను. హంతకు

డెలాగూ సాయంత్రం వరకూ రాడు. వాడొచ్చేలోగా మనం మంచి పథకం వేయాలి" అన్నాడు జనార్దనం. అతనాప్యాయంగా భార్య కళ్ళలోకి చూస్తున్నాడు.

ఆ సమయంలో ఎవరో యింటి తలుపు తట్టారు. జనార్దనం వెళ్ళి తలుపులు తీశాడు.

"నమస్కారమండీ జనార్దనంగారు మీరేనా?" అనడిగింది తలుపు తట్టినామె.

"అవునండి, మీరెవరు?"

"నా భర్త పేరు అనంతం. నిన్న రాత్రి ఆయన మీ ఇంటికని బయల్దేరారు. తను రాత్రికి రాననీ, బహుశా అక్కణ్ణించి అలాగే ఏదైనా అర్జంటు పనిమీద పొరుగూరు వెళ్ళవచ్చుననీ, అలా అవసరపడే పక్షంలో ఉత్తరం రాసి మీయింట్లో ఇచ్చి వెడతాననీ చెప్పారు" అందామె.

జనార్దనం క్షణం ఆలోచించాడు. ఆమె కేమని చెప్పాలి? అనంతం హత్య చేయబడ్డాడన్న నిజం ఆమెకు తెలియకూడదు. తెలిస్తే తను చిక్కుల్లో పడతాడు. నిజం చెప్పాలంటే అర్ధరాత్రివేళ చావుకేక విని లేచి వెళ్ళి చూడకపోతే అసలు అనంతం తనింటికి వచ్చినట్లే తెలిసుండేది కాదు.

"అనంతమంటే ఎవరో నాకర్థం కాలేదు."

"మీరు తనకు క్లబ్బులో పరిచయమయ్యారని చెప్పారాయన..."

జనార్దనం క్షణం ఆలోచించినట్లు నటించి "ఓహో ఆ అనంతమా! అతను నాకు బాగా తెలుసు. కానీ రాత్రి అతను మా యింటికి రాలేదే?" అన్నాడు.

అనంతం భార్య దెబ్బతిన్నట్లు కనబడింది. "ఏమన్నారూ? ఆయన మీ యింటికి రాలేదూ?" అంది.

"రాలేదండి" అన్నాడతను.

ఆ విషయాన్ని ధృవపర్చుకుని ఆమె వెళ్ళిపోయింది. జనార్దనం తలుపులు వేసి భార్య దగ్గరకు వెళ్ళాడు. జరిగింది చెప్పాడు. ఇద్దరం అనంతం భార్యను తల్చుకుని జాలిపడ్డారు.

"పాపం ఆవిడకు భర్త పోయినట్లు తెలియదు. ఎంత కాలమలా ఎదురు చూస్తుందో అతనికోసం—" అంది సీత.

"హంతకుడసాధ్యుడు. బహుశా అనంతం గురించి ఏవిధమైన ఆచూకీ బయటపడ నివ్వడనుకుంటాను" అన్నాడు జనార్దనం.

సీత ఉలిక్కిపడింది. "అనంతం హత్య చేయబడ్డట్లు తెలిసిన వాళ్ళం మన మిద్దరమే—ఆ విషయం హంతకుడికి తెలిసిందంటే..."

"సీతా నాకో ఆలోచన తడుతోంది." అన్నాడు జనార్దనం. "హత్య కళ్ళబడిన కారణంగా నీకు జ్వరం వచ్చింది. జర్వానికి బదులు నీకు చాలా పెద్ద జబ్బు చేసిందనుకో, నిన్నేదైనా నర్సింగ్ హోమ్‌లో చేర్చాలనుకో అప్పుడు మనం చెప్పకుండానే హంతకుడు తనకు తనే ఇల్లు వదిలి వెడతాడు."

"కానీ, నాకు పెద్ద జబ్బు చేయలేదు. అది మన దురదృష్టం" అంది సీత.

"సీతా నా వెర్రి సీతా!" అన్నాడు జనార్దనం "నీకు జబ్బు చేయనవసరం లేదు. అలా నటిస్తే చాలు."

"నటనా?" అంది సీత కంగారుగా.

"అవును, అంతకుమించి ఉపాయం వేరే కనబడ్డం లేదు" అన్నాడు జనార్దనం.

"సాయంత్రం హంతకుడు వచ్చిన గంటకు నువ్వు మెలికలు తిరిగిపో. దారుణమైన బాధనభినయించు. నేను నిన్ను నర్సింగ్ హోమ్‌లో చేర్చే ఏర్పాట్లు చేస్తాను" అనాడు జనార్దనం.

తర్వాత అతను నెమ్మదిగా పనులు చేసుకోసాగాడు. పక్క వీధిలో పబ్లిక్ టెలిఫోన్ బూత్ లోంచి కంపెనీకి ఫోన్ చేసి తను ఆఫీసుకు రావడం లేదని చెప్పాడు.

సీత జ్వరం మధ్యాహ్నానికి దిగిపోయింది. భోజనం చేసేయవచ్చునని డాక్టర్ చెప్పినప్పటికీ ఆ పూటకు బ్రెడ్ తీసుకుందామె ఎందుకైనా మంచిదని.

సాయంత్రం హంతకుడు సుమారు అయిదు గంటల ప్రాంతంలో వచ్చాడు. అతడు చాలా ఉత్సాహంగా ఉన్నాడు. వస్తూనే అతను సీత యోగక్షేమాలు విచారించాడు. ఆమె జ్వరం తగ్గిపోయినందు కానందాన్ని వ్యక్తపరిచాడు.

"చాలా ఉత్సాహంగా కనబడుతున్నావ్?" అన్నాడు జనార్దనం.

"అవును ఒక సమస్య తీరిపోయింది. మరో కొత్త బేరం తగిలింది..." అన్నాడు హంతకుడు.

'బేరమంటే?' అనుకున్నాడు జనార్దనం తనలో. బహుశా మళ్ళీ ఎవరికో మూడి వుండాలి. పాపం ఆ దురదృష్టవంతు డెవరో? అతనికి అనంతం గుర్తుకువచ్చాడు.

"ఉదయం మా ఇంటి కొకామె వచ్చింది. తన భర్త

పేరు అనంతం అని చెప్పింది. అనంతం నాకు క్లబ్బు స్నేహితుడు. అతను రాత్రి నా యింటికని బయల్దేరి మళ్ళీ తిరిగి ఇల్లు చేరలేదట. ఏమైనా తెలుసునేమో అడుగుదామని వచ్చింది'' అన్నాడు జనార్దనం.

''ఆమెకు నీ ఇల్లెలా తెలుసు?'' అనుమానంగా అడిగాడు హంతకుడు.

''మా ఇంటినుంచి అనుకోని పని తగిలితే పొరుగూరు వెళ్ళాల్సి వుంటుందనీ అలా జరిగే పక్షంలో ఒక ఉత్తరం మా ఇంట్లో ఇచ్చి వెడతానని చెప్పాడట. బహుశా భర్త ఆమెకు చిరునామా యిచ్చివుంటాడు—'' అన్నాడు జనార్దనం.

''ఏం చెప్పావ్ నువ్వు?''

''అనంతంతో నాకు కాస్త పరిచయమున్న మాట నిజమే కానీ, మా ఇద్దరికీ ఒకరిళ్ళకొకరు వెళ్ళేటంత పరిచయాలు లేవు. రాత్రి నాకు తెలిసినంత వరకూ మాఇంటికెవ్వరూ రాలేదని చెప్పాను. నిరుత్సాహంగా వెళ్ళిపోయింది. చాలా జాలి కలిగిందామెను చూస్తే నాకు.''

హంతకుడు తేలిగ్గా నిట్టూర్చాడు. ''అనంతానికి నీతో పనిలేదు. కానీ నాతో పనివుంది. అతను నీ యింటికని బయల్దేరాడు. కానీ, నీ ఇంటికి రాలేదు. మధ్యలో నే పొరుగూరు వెళ్ళిపోవలసొచ్చింది. నేనే స్వయంగా అతన్ని పంపేశాను. వెళ్ళేముందు తన భార్యకో ఉత్తరమిచ్చాడు అదామెకు నేనీ రోజు మధ్యాహ్నం అందజేశాను.''

ఇద్దరూ అవీ ఇవీ కబుర్లలో ఉండగా లోపల్నుంచి ఆర్తనాదంలాంటిది వినపడింది. జనార్దంతోపాటు హంతకుడుకూడా లేచాడు. కంగారుగా లోపలకు ప్రవేశించా

రిద్దరూ. లోపల మంచం మీద సీత కడుపు పట్టుకుని మెలి కలు తిరిగిపోతోంది. వీళ్ళను చూస్తూనే "బాధ భరించ లేక పోతున్నాను. కడుపులో నొప్పి" అంటూ అరిచినట్లు చెప్పింది.

హంతకుడు కంగారుగా "బావా నువ్వు చెల్లాయ్ దగ్గ రుండు నేను వెళ్ళి డాక్టర్ని పిలుచుకువస్తాను" అన్నాడు.

"నువ్వే వుండిక్కడ మా ఫామిలీ డాక్టర్ని పిలుచుకు వస్తాను..." అన్నాడు జనార్దనం.

"నువ్వెందుకులే బావా చెల్లాయ్‌కి నువ్వు పక్కనుంటే ధైర్యంగా వుంటుంది. ఫామిలీ డాక్టరు అడ్రసివ్వు. క్షణాల మీద తీసుకొస్తాను" అన్నాడు హంతకుడు.

"లేదు నేను వెడితే కానీ ఈ సమయంలో ఆయన రాడు. పేషెంట్లతో చాలా రద్దీగా వుండే సమయమిది" అన్నాడు జనార్దనం. అతని బాధ వేరు. సీత జబ్బుగురించి ఫామిలీ డాక్టరుకి కాస్త వివరించాలని అతననుకుంటు న్నాడు.

కానీ హంతకుడు వినలేదు "ఏం మనిషివి నువ్వు బావా అవతల చెల్లాయలా అవస్థపడుతూంటే నీకు కాళ్ళూ చేతులూ ఎలా ఆడతాయి. డాక్టరెందుకు రాడు. రివాల్వర్ చూపించైనా లాక్కొస్తాను. నీకా భయం లేదు" అంటూ సమాధానం కోసమైనా ఎదురు చూడకుండా వీధిలోకి పరుగెత్తాడు. అతని వెనుకనే వెళ్ళి వీధి తలుపులు వేసి భార్య దగ్గరకు వచ్చి తలపట్టుకున్నాడు జనార్దనం.

"అతను వెళ్ళడమే మంచిదయింది. లేకపోతే డాక్టర్ వచ్చేదాకా ఇలా నటించడం నావల్లనయ్యేది కాదు" అంది సీత.

"చాలా బాగుంది నువ్వో గంట నటన గురించి ఆలోచిస్తున్నావ్. కానీ ఈ హంతకుణ్ని వదిలించుకునే ఓ గొప్ప అవకాశం పోయిందని నాకు బాధగా వుంది."

"అలా భయపడకండి. డాక్టర్ వచ్చేక పక్కకు వెళ్ళి విషయం చెప్పండి."

"అందుకీ హంతకుడు అవకాశమిస్తాడని నాకు తోచడం లేదు" అన్నాడు జనార్దనం.

హంతకుడు డాక్టర్ని తీసుకురావడానికి గంట కూడా పట్టలేదు. డాక్టర్ కంగారుగా "ఏమైంది మిస్ సీతాదేవీ!" అన్నాడు.

సీత నానా అవస్థనూ నటిస్తూ "కడుపులో బాధ డాక్టర్ గారూ భరించలేక పోతున్నాను. ఈ బాధ భరించేకంటే ప్రాణాలు పోయినా బాగుండుననిపిస్తోంది" అంది.

"నోనోనో—అలా ప్రతిదానికి అసహనం కూడదు" అంటూ డాక్టర్ సీతను పరీక్ష చేశాడు. అయిదు నిమిషాల అనంతరం డాక్టర్ జనార్దనం వంక చూసి "జ్వరం తగ్గిపోయింది. ఒంట్లో ఏమీ అనారోగ్యమునట్లనిపించడం లేదు. ఇంక నాకు ఒక్కటే అనుమానం మిగిలింది. నేను లైటుగా మీల్సు తీసుకోమన్నాను. జిహ్వా చాపల్యం కొద్దీ కాస్త స్ట్రాంగ్ ఫుడ్ తీసుకుని ఉండాలి" అన్నాడు.

"నాకు తెలిసినంత వరకూ సీత బ్రెడ్ తప్ప ఇంకేమీ తినలేదు. హార్లిక్స్ తప్ప మరేమీ తాగలేదు" అన్నాడు జనార్దనం.

"ఏమైనప్పటికీ కంగారేమీ లేదు. ప్రస్తుతానికి

తాత్కాలికోపశాంతి కలిగించి, నిద్రపట్టేలా మందిస్తాను. ఉదయానికేమీ కంగారు లేకపోతే ఇంక నాదగ్గరికి రావలసిన అవసరం లేదు'' అన్నాడు డాక్టర్.

''ఏమీ ప్రమాదం లేదంటారా డాక్టర్ సీతది చాలా డెలికేట్ బాడీ. దేనికీ తట్టుకోలేదు. ఉదయం జ్వరం వచ్చింది. సాయంత్రానికి కడుపునొప్పి వచ్చింది. మళ్ళీ రాత్రికి ఏమవుతుందోనని భయంగా వుంది. కొన్ని రోజుల పాటు మీ నర్సింగ్ హోమ్‌లో ఉంటే మంచిదేనని పిస్తోంది'' అన్నాడు జనార్దనం.

''వ్వాట్! కడుపు నొప్పికి నర్సింగ్ హోమా భలే కంగారు మనుషులండి మీరు'' అని నవ్వి ''పోనీ మీకంత భయంగా వుంటే నాకేమీ అభ్యంతరం లేదు'' అన్నాడు డాక్టర్.

జనార్దనం తృప్తిగా నిట్టూర్చి ''నామనసిప్పుడు తేలిగ్గా ఉంది'' అన్నాడు.

హంతకుడు కలగజేసుకుని ''ఇలాంటి చిన్న చిన్న వాటికి నర్సింగ్ హోంలో చేర్చడం మనిషి ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదు. పది రోగులమధ్య వుంటే ఆరోగ్యంగా వున్న వాడికూడా జబ్బుపడ్డ అనుభూతివచ్చేస్తుంది. ఇంట్లో ప్రశాంతమైన వాతావరణంలో ఉంటే మరే ఇబ్బందీ ఉండదు'' అన్నాడు.

''కానీ, కాస్త కనిపెట్టి చూసుకునేవారు కావాలి కదా...అవసరమైన వెంటనే డాక్టర్ రావాలి కదా'' అన్నాడు జనార్దనం.

''చెట్టంత అన్నగారిని నేనున్నాను. ప్రాణప్రదంగా చూసుకునే భర్తవు నువ్వున్నావు. పిలిస్తే పలికే దేవుడి

లాంటి డాక్టరీయనున్నారు. ఇప్పుడు సీతపు వచ్చిన లోటే ముంది? అంతగా అనుక్షణం కనిపెట్టుకు చూసేవాళు కావాలనుకుంటే నాకు తెలిసిన లలితారాణి అనే నర్ ఒకామె వుంది. ఆమెను పిల్చుకువస్తాను" అన్నాడు హంతకుడు.

జనార్దనం కడబడ్డాడు. అతని నోరు మూతపడింది.

డాక్టరు "మీ బావగారి మాటలు నిజం. అలా జరిపి బాగుంటుంది" అన్నాడు.

జనార్దనం మౌనంగా తలూపాడు.

ఆ రాత్రి అతను భార్యతో, "ఈ హంతకుడు అసా ధ్యుడు. వీణ్ని వదుల్చుకోవడం మనకు సాధ్యపడేలా లేదు మనకింకే నర్సూ అవసరంలేదు. రేపటికి నీ కడుపునొప్పి పూర్తిగా తగ్గిపోవాలి" అన్నాడు.

9

"ఈరోజు రాత్రి నేను బయట భోజనం చేస్తాను" అ సాయంత్రం ఆరుగంటలకు భార్యాభర్తలిద్దరకూ చెపి హంతకుడు బయటకు వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయాక దంపతులిద్దరూ హంతకుడిగురిం చర్చించుకున్నారు. ఏంచేయాలో ఇద్దరికీ పాలుపోవడ లేదు. జరిగిన సంఘటనలు భయాన్ని కలిగిస్తున్నాయి జరుగుతున్న సంఘటనలు నవ్వాలో, ఏడవాలో తెలియ కుండా చేస్తున్నాయి. జరగబోయే సంఘటన లేల వుంటాయోనని ఉత్కంఠను కలిగిస్తున్నాయి. కానీ, తావ చేయగలిగినదేమీ లేదు. నిస్సహాయంగా చూస్తూ ఊరి కోవడమే!

తొమ్మిది గంటల ప్రాంతంలో నిద్రపోయే ముంద

"హంతకుడింకా రాలేదు. దొడ్డితలుపు తీసివుందో లేదో, చూసి, తీసి వుంచకపోతే అనవసరపు గొడవ" అన్నాడు జనార్దనం. ఇద్దరూ ఆ సంగతి చూడడానికి వెళ్ళారు. చూడడం మంచిదే అయింది. దొడ్డితలుపు వేసివుంది. గడియ తీసి ఇద్దరూ తమ పడకగదిలోకి వెళ్ళిపోయారు. హంతకుడి నింట్లోంచి పంపించేయడానికి యింకా యేం పథకాలు వేయాలా అని కాసేపు చర్చించి నిద్రకు పడ్డారిద్దరూ.

ఒక రాత్రివేళ ఎవరో తలుపు తడుతున్న చప్పుడు విని చటుక్కున లేచాడు జనార్దనం. సీత అతని చేయి పట్టుకుంది. "చప్పుడు నేనూ విన్నాను. నాకేదో భయంగా వుంది. మీరు వెళ్ళొద్దు" అందామె.

తలుపులు మరింత గట్టిగా బాదారెవరో!

"ఫరవాలేదు - భయపడకు" అంటూ మంచం దిగాడు జనార్దనం. దుప్పటిని మీదకు లాక్కుని కప్పుకుంది సీత.

జనార్దనం గదిలో లైటు వేశాడు. తలుపులింకా ఎవరో బాదుతూనే వున్నారు. "ఎవరది?" గట్టిగా అన్నాడు జనార్దనం.

"నేను" అని సమాధానం వచ్చింది. కంఠం హంతకుడిది.

"అమ్మయ్య!" అని తేలిగ్గా నిట్టూర్చింది సీత. హంతకుడంటే వాళ్ళకు క్రమంగా భయం తగ్గుతోందనే అనుకోవాలి. అతనెలాంటివాడైనా తమకేమీ అపకారం చేయడన్న అభిప్రాయం సీతకు కలిగింది.

జనార్దనం వెళ్ళి తలుపులు తీశాడు. బయట హంతకుడు నిలబడి వున్నాడు. "ఇద్దరికిద్దరే మొద్దు నిద్ర" అన్నాడు

చిరాగ్గా. అతని ముఖం ప్రసన్నంగా లేదు.

"బాగుంది. రాత్రి సమయంలో లేపేవాళ్ళదే కానీ, పడుకునేవాళ్ళది తప్పుకాదు..." అన్నాడు జనార్దనం.

"సరేలే. ఇప్పుడు నేను తప్పొప్పులు విచారించడానికి రాలేదు. నా గదిలో ఒక్క చుక్క కూడా మంచినీళ్ళు లేవు. ఇప్పుడే ఒక కస్టమర్ని తీసుకువచ్చాను. అతనితో మాటలు మొదలు కాకుండానే దాహమన్నాడు. తీరా చూస్తే కూజా ఖాళీ! నా గదిలో ఏర్పాట్లన్నీ పక్కాగా. వుండాలని వచ్చినరోజునే చెప్పాను..." అన్నాడు హంతకుడు.

"సరేలే - ఏదో పొరపాటు జరిగినట్లుంది. వచ్చి కూజా తీసుకువెళ్ళి నింపి యిస్తాను" అన్నాడు జనార్దనం.

"నువ్వు రానవసరంలేదు. నా కస్టమర్ను మరొకరి కళ్ళపడ్డం నా కిష్టముండదు. ఏదో, బావా అని పిలుస్తున్నాను నిన్ను. అలాంటిది నిన్ను చంపాల్సివస్తే నాకెంత బాధగా వుంటుందో ఆలోచించు. అందుకే ఓ చెంబెడు నీళ్ళియ్యి. ఈ రాత్రికి సర్దుకుంటాను. రేపుమాత్రం, నువ్వు చేయవలసిన మొట్టమొదటి పని అదే!" అన్నాడు హంతకుడు.

జనార్దనం మనసులో మాత్రమే విసుక్కున్నాడు. గదిలో మరచెంబు నిండా నీళ్ళున్నాయి. ఆ చెంబు తీసుకువెళ్ళి హంతకుడికిచ్చి గది తలుపులు వేసేసి లైటు ఆర్పేశాడు.

"మళ్ళీ హంతకుడెవరో మనిషిని తీసుకువచ్చాడు. ఇంకో హత్య జరుగుతుందేమో!" అన్నాడు జనార్దనం సీత దగ్గరకు వెళ్ళి.

"ఏమో యేమిటి-జరిగి తీరుతుంది. ఏ జన్మలో ఏం పాపం చేశామో, ఇలాంటి హంతకుడికి ఆతిథ్యమివ్వాల్సొచ్చింది" అంది బాధగా సీత.

"సీతా-నువ్వు మాట్లాడకుండా పడుకుని వుండు. బయటకు వెళ్ళి ఏం జరుగుతుందో చూసివస్తాను" అన్నాడు జనార్దనం.

"వద్దండీ-వాడసలే మిమ్మల్ని హెచ్చరించి వున్నాడు కూడా. ఏం చేస్తాడో ఏమిటో."

"వాడికి తెలియనివ్వనుగా, రహస్యంగా చూసేసి వస్తాను. హంతకుడన్నవాడెప్పుడో అప్పుడు చట్టానికి దొరక్క తప్పదు. అలాంటి సమయం వచ్చినప్పుడు తిరుగులేని దెబ్బలు తీయడానికి, వీడి బండారం కొంతవరకూ తెలుసుకుని వుండడం మంచిది. నువ్వుమాత్రం రావద్దు. ఎందుకంటే నీకు మళ్ళీ జ్వరంలాంటిది వస్తే హంతకుడి అనుమానాలు బలపడతాయి" అని జనార్దనం పిల్లిలా అడుగులు వేసుకుంటూ గదిలోంచి బయటపడి, గది తలుపులు చప్పుడు కాకుండా జారగిలవేశాడు.

హంతకుడి గదిలో దీపం వెలుగుతోంది. గదిలో కూర్చున్న మనిషి వీపు కనబడుతోంది. హంతకుడి ముఖం గుమ్మంవైపే వుంది. జనార్దనం గోడవార నక్కాడు. ఒకవేళ ఎవరైనా గదిలోంచి బయటకువస్తే, పక్కకు జారుకునేందుకు వీలుంది. అతను శ్రద్ధగా వాళ్ళ మాటలు వినసాగాడు. వాళ్ళు నిర్భయంగా గట్టిగా మాట్లాడుకుంటున్నారు.

"ఈ స్థలం నాకు చాలా అనువుగా వుంది. అందువల్ల హత్యచేయడం నాకిప్పుడు చాలా సులువు. నీ పనేమిటో

త్వరగా చెప్పు..." అన్నాడు హంతకుడు.

"కాస్త నెమ్మదిగా మాట్లాడవయ్యా - ఎవరైనా విన గలరు?" అన్నాడు కొత్త వ్యక్తి.

"వినడమా_ఈ ఇంట్లో మనం కాక ఇంక ఇద్దరే ఇద్దరు మనుషులున్నారు. ఇద్దరికీకూడా నేనంటే చచ్చేటంత భయం" అన్నాడు హంతకుడు నిబ్బరంగా.

"సరే_విషయానికి వద్దాం, ఎలా చంపుతావో అది నీ ఇష్టం. నా మీదకు ఎవరి అనుమానమూ రాకూడదు. లక్ష్మీ నారాయణ ఈ లోకంలో వుండకూడదు. ఎంత కావాలో చెప్పు!"

"మీ శక్తినిబట్టి నా రేటుంటుంది. అందరికీ ఒకే రేటు కాదు నాది" అన్నాడు హంతకుడు దర్పంగా.

"సరే_అయితే చెబుతున్నాను. పాతిక వేలిస్తాను" అన్నాడా కొత్త వ్యక్తి.

హంతకుడు క్షణం ఆలోచించి, "ఓకే - బాగానే చెప్పారు - మీరిక వెళ్ళవచ్చు" అన్నాడు.

కొత్త వ్యక్తి లేవలేదు, "ఎప్పుడు?"

"రేపు రాత్రికి లక్ష్మీనారాయణ ఈ లోకంలో వుండడు. మీకు వాటాదారుడుగా వుంటూ, మిమ్మల్ని మోసంచేసి మీ వ్యాపారంలో ఎక్కువ లాభాలు కొట్టే సిన పాపానికి, ఆయన రేపురాత్రి శిక్ష ననుభవిస్తాడు. మీ ఇష్టం వచ్చినట్లు మీరు పగ తీర్చుకోవచ్చు. ఆయన కుటుంబానికి మీ రన్యాయం తలపెట్టవచ్చు..."

"ఛా_అలా ఎందుకు చేస్తాను! వాళ్ళ జీవితానికి లోటు లేకుండా ఏర్పాట్లు చేస్తాను..."

"అది మీ ఇష్టం_మీకు సంబంధించిన పని" అన్నాడు హంతకుడు.

కొత్త వ్యక్తి లేచాడు. జనార్దనం చీకట్లోకి వెళ్ళి పోయాడు. హంతకుడు కొత్తవ్యక్తిని దొడ్డిగుమ్మంద్వారా సాగనంపుతూంటే, జనార్దనం తన పడకగదిలోకి వెళ్ళి పోయాడు.

10

"బావా! మళ్ళీ రిక్షా కావాలి – మీ ఇంటినుంచి నది ఒడ్డుకు. నేనూ, ఒక ట్రంకుపెట్టీ వుంటామని చెప్పు..." అన్నాడు హంతకుడు.

జనార్దనం గుండె లదిరాయి. లక్ష్మీనారాయణ కథ ముగిసిందని అర్థమయిం దతనికి. ఎవడో ఆ లక్ష్మీనారాయణ–అనుకున్నాడతను.

జనార్దనం వెళ్ళి రిక్షా పిల్చుకువచ్చాడు. అతనూ, హంతకుడూ కలిసి బరువైన ఆ ట్రంకుపెట్టిని మోసి రిక్షాలో పెట్టారు. రిక్షా కదిలి వెళ్ళిపోయేక, "ఇంకా యిలాంటి ట్రంకు లెన్ని మోయాల్సుందో నేను..." అన్నాడు జనార్దనం.

సీత తలుపులు వేసి, "ఒకసారి హంతకుడి గదిలోకి వెళ్ళి చూద్దాం పదండి" అంది.

ఇద్దరూ హంతకుడి గదిలోకి వెళ్ళారు. గదంతా శుభ్రంగా తుడిచినట్లుంది. ఒకటి రెండు ప్రాంతాల నీళ్ళతో కడిగినట్లుంది. మంచంమీద దుప్పటీ నలగకుండా వేసివుంది.

"హంతకుడీ పర్యాయం మంచంమీద హత్యకు మన దుప్పటీ వాడినట్లు లేదు" అన్నాడు జనార్దనం.

"వాడితే, శెల్లాయ్–దుప్పటీ మార్చాలమ్మా" అంటూ అడిగుండేవాడుగా అంది సీత. ఆమె ఒక్క క్షణం ఆలో

చించి, "ఈ రాత్రి మనకేమీ కేక వినపడలేదు గదా - మనం అంత మొద్దునిద్దర పోయామంటారా?" అంది మళ్ళీ.

"హంతకుడు చాలా తెలివైనవాడు. క్రితం పర్యాయం చచ్చినవాడంత పెద్దకేక పెడతాడని అతని ఊహకు తట్టలేదెందువల్లనో. అందుకే ఈ పర్యాయం హంతుడికి నోట్లో గుడ్డలుకుక్కి చంపేసి వుంటాడు. కిక్కురుమనకుండా చచ్చుంటాడు పాపం."

సీత మరోపర్యాయం మంచంమీద దుప్పటీ వేసి తలగడాలు సర్దబోతూండగా వాటికింద ఒక చిన్న నోట్ బుక్ కనబడింది. జనార్దనం చటుక్కున సీత చేతిలోంచి ఆ పుస్తకం లాక్కున్నాడు. అందులో మొదటిపేజీ చూసి గతుక్కుమన్నాడతను.

ఆ పేజీలో కొన్ని పేర్లు రాసివున్నాయి. ఒకటి అంకె వేసి అనంతం పేరు రాసివుంది. రెండంకె వేసి లక్ష్మీనారాయణ పేరు రాసివుంది. రెండు పేర్లకూ పక్కన ఇంటూమార్కులు పెట్టివున్నాయి. మూడో అంకె వేసుంది కానీ, అక్కడింకా పేరేదీ వ్రాయబడలేదు. జనార్దనం ఆ పేజీని సీతకు చూపించాడు. సీత కది చూస్తూనే ముచ్చెమటలూ పోశాయి.

"ఇదెక్కడి తంటసం వచ్చిపడిందండీ మనకి! హాయిగా సుఖంగా వున్నామనుకుంటే" అంది సీత భయంగా.

జనార్దనం నోట్ బుక్ లో పేజీలు తిరగేశాడు. ఒక పేజీలో రెండు చిరునామాలున్నాయి. ఒకటి అనంతానిది. రెండు లక్ష్మీనారాయణది. ఆతృతగా అతనా చిరునామా చూశాడు. హోటల్ గ్రీన్‌లాండ్స్‌లో పనిహేనో నంబరు గదిలో వుంటున్నాడు లక్ష్మీనారాయణ. అంటే ఈ ఊరి

వాడై వుండడు లక్ష్మీనారాయణ. అతనెవరో, అతని కథేమిటో తెలుసుకోవా లనిపించింది జనార్దనానికి. సీతకు కూడా అదేమాట చెబితే, "చూడండి, అనవసర వ్యవహారాల్లో తల దూర్చకండి మీరు. అనవసరంగా హత్య కేసులో ఇరుక్కోగలరు" అందామె.

కానీ, జనార్దనానికి కుతూహలం చావలేదు. అత నాఫీసుకు వెళ్ళేముందు హోటల్ గ్రీన్‌లాండ్సుకి వెళ్లాడు.

లక్ష్మీనారాయణ ఇంకా హోటల్ ఖాళీ చేయలేదు. అతనక్కడ భార్యతోసహా మకాం పెట్టాడు. గదిలో అతని భార్య వుంది. తన భర్తకోసం ఎవరో వచ్చారని తెలియగానే ఆత్రంగా చూడబోయిందామె. జనార్దనాన్ని చూస్తూనే ఆమె ముఖంలో నిరుత్సాహం కనబడింది.

"నిన్నరాత్రి వారు - ఒక నూతన వ్యక్తితో వెళ్ళారు. అవసరమైన పక్షంలో పొరుగూరు వెళ్ళాల్సుంటుందనీ, అలా జరిగేపక్షంలో కబురు పంపిస్తాననీ అన్నారు. నాకు కబురువస్తే, గది ఖాళీచేసేసి రాత్రి ట్రయిన్‌కి వెళ్ళిపోతాను" అందామె.

"సరే - అయితే నాకాయన్ను కలుసుకునే అదృష్టం లేదు. నా స్నేహితుడొకడుకూడా ఆయన్ని కలుసుకోవా లనుకున్నాడు. నిన్నరాత్రి మీ భర్త వెళ్ళిన నూతనవ్యక్తి ఎలాగుంటాడో చెప్పగలరా? అతనే నా స్నేహితుడైతే, నేనింక వేరే మీ భర్తను కలుసుకోవాల్సిన అవసర ముండదు" అన్నాడు జనార్దనం.

ఆమె వర్ణించి చెప్పింది. అవి సరిగ్గా హంతకుడికి సరిపోయాయి. జనార్దనం అక్కణ్ణించి బయటపడ్డాడు. అతని

మనస్సు నిండా లక్ష్మీనారాయణ భార్యపట్ల జాలి నిండి వుంది. ఆమెకు ముప్పై అయిదేళ్ళుంటాయి. మనిషి చాలా అందంగా వుంది. పదేళ్ళు దాటిన పిల్లలిద్దరున్నారు. ఇంత వరకూ ఖరీదైన జీవితం అనుభవించిందామె!

జనార్దనం ఆఫీసులో వుండగా అతనికి ఫోన్ కాల్ వచ్చింది. అతను చాలా ఆశ్చర్యపడ్డాడు. ఫోన్ చేసింది అతని మావగారు. అర్జంటుగా ఏదో మాట్లాడాలనీ, అప్సరా హోటల్లో పదకొండో నంబరు గదిలో సాయంత్రం తనని కలుసుకోవలసిందనీ శంకర్రావుగారు ఫోన్ చేశాడు. తను వచ్చిన విషయం సీతకు చెప్పవద్దన్నాడు.

మావగారికి తనతో మాట్లాడవలసొచ్చిన అర్జంటు విషయమేమిటో అర్థంకాక చాలాసేపు మథనపడ్డాడు జనార్దనం. ఆయనకు తనంటే ద్వేషభావం తప్ప మరేమీ లేదు. తన చావుకోరే వ్యక్తి ఆయన. ఆయనవద్ద నమ్మిన బంటుగా, చేదోడు వాదోడుగా వుంటూన్న వెంకటరమణంటే ఆయనకు ఎంతిష్టముంటే, అతన్ని యింటల్లుడిగా చేసుకోవాలనుకుంటున్నా రాయన. వెంకటరమణ ఆయన కేదో దూరపువరుసలో బంధువవుతాడు. చిన్నప్పట్నించీ మావయ్యా అని పిలుస్తూ, ఆయనింట్లోనే పెరిగి పెద్దవాడయ్యాడు. శంకర్రావుగారిచ్చిన చనువును పురస్కరించుకుని అతను సీతమీద చాలా ఆశలు పెంచుకున్నాడు. కానీ, విధి మరోలా తలచింది. సీత తనని ప్రేమించింది!

వెంకటరమణ ఇంకా పెళ్ళి చేసుకోలేదు. తను చస్తాడనో, లేక సీత తనకు విడాకులిస్తుందనో అతనికింకా ఆశ వున్నట్లుంది. బహుశా, ఆ ఆశను శంకర్రావుగారే కల్పించి వుంటారని సీత అంటుంది.

శంకర్రావుగారు తనతో ఇప్పుడర్జంటుగా మాట్లాడ వలసిన దేమిటో!

సాయంత్రం ఆఫీసునుంచి వెళ్ళేటప్పుడు జనార్దనం అప్సరా హోటల్‌కు వెళ్ళి శంకర్రావుగారిని కలుసుకున్నాడు. అత ననుకున్నట్లు శంకర్రావుగారు ద్వేష భావాన్ని ప్రదర్శించలేదు. మొట్టమొదటిసారిగా ఆయన అల్లుడితో ఆప్యాయంగా మాట్లాడేరు.

"మొదట్లో తప్పుగా అర్థంచేసుకున్నాను కానీ, నువ్వు చాలా యోగ్యుడివి. సీత కాపురం-హాయిగా నడుస్తోందని తెలుసుకున్నాను. ఎటొచ్చీ నాకు ఒక్కటే బాధగా వుంది. సీత నాకొక్కగానొక్క బిడ్డ. దాన్ని నేను కంటికి రెప్పలా పెంచాను. కష్టమంటే తెలియకుండా చూసుకున్నాను. ఈనాడది సామాన్యమైన జీవితం గడుపుతూంటే చూస్తూ ఊరుకోలేకున్నాను."

"సీత జీవితం ఇప్పుడు సామాన్యంగా ఏమీ లేదు..." అన్నాడు జనార్దనం పౌరుషంగా.

శంకర్రావుగారు నాలిక్కరుచుకుని, "నా అభిప్రాయం అదికాదు. నిన్ను చిన్నబుచ్చాలన్నది నా అభిమతం కాదు. నేను చెప్పేది విని నువ్వే ఆలోచించు. నేను కోటీశ్వరుణ్ణి. నువ్వో సామాన్య ఉద్యోగస్తుడివి. నా స్థాయికి నువ్వెన్నడూ చేరుకోలేవు. నాకులా సీతను చూసుకోనూ లేవు" అన్నాడు.

జనార్దనానికి కోపం వచ్చిందన్న విషయం యెర్రబడ్డ అతని ముఖమే చెబుతోంది.

"అలాగని నువ్వు సీతకు తక్కువ చేస్తున్నావని నే ననడంలేదు. వివాహమైపోయినంత మాత్రాన తండ్రిగా

నా బాధ్యతలు తొలగిపోతాయని నేననుకోవడంలేదు. కానీ, నా పేరు చెబితేనే మండిపోతోంది సీత. అది నా దురదృష్టం. నువ్వు నాకు చేయగలిగిన సహాయమేమిటంటే నేను నీకో కారు కొనిస్తాను. బ్యాంకులో నీ పేరున రెండులక్షలు వేస్తాను. ఈ రెండూ నావల్ల జరిగినట్లు సీతకు తెలియనివ్వకు. సీతను మాత్రం దర్జాగా చూసుకో. దాన్ని కారులో తప్ప తిప్పవద్దు'' అన్నాడు శంకర్రావు నిట్టూరుస్తూ.

జనార్దనం ఉలిక్కిపడ్డాడు. మామగారి అభిప్రాయమది అని అతని కింతవరకూ తెలియలేదు. వెంటనే ఏం చేయాలో, ఏం మాట్లాడాలో తోచక అతను మౌనం వహించాడు.

''కోటీశ్వరుడి ఏకైక పుత్రికకు భర్తవు నువ్వు. ఆ దృష్ట్యా చూస్తే నీకు రెండులక్షలివ్వడం నువ్వు అవమానంగా భావిస్తున్నావనుకుంటాను. నన్ను పూర్తిగా అర్థం చేసుకుంటే అలాగనుకోవు. నేను అమ్మాయి పేరున పది లక్షల రూపాయలకు షేర్లు కొన్నాను. అవికూడా నీకే ఇస్తున్నాను. భద్రంగా దాచివుంచు. ఆమె అర్థాంతరంగా మరణించిన పక్షంలో అవి నీ పేరుకు మారతాయి. సీత పెళ్ళికి ముందే ఈ షేర్లున్నాయి. ఆ సంగతి దానికీ తెలుసు. కానీ, నేనిస్తే అది తీసుకోదు. నువ్వుకూడా ఈ వివరాలు వెంటనే చెప్పవద్దు. దాని మనసు కనిపెట్టి, మంచి సమయం చూసి చెప్పు'' అంటూ ఆయన అతనికి కొన్ని కాగితాలందించాడు.

జనార్దనానికి చాలా వింతగా వుంది. అతనా కాగితాలను పరిశీలించి చూశాడు. పేరుపొందిన రకరకాల కంపె

నీలలో సీత పేరున షేర్లున్నాయి. అవన్నీ ఆమెకు కాబోయే భర్తకు చెందుతాయి. ఆ భర్త అర్థాంతరంగా మరణించిన పక్షంలో అవి శంకర్రావుకు చెందుతాయి. వాటిలో వీలు నామా ఒకటి వుంది. అది శంకర్రావు ఆస్తిపాస్తులలో సీతకు చెందవలసినవాటి వివరాలనిస్తూ వ్రాయబడింది. సీత మరణించిన పక్షంలో ఆ ఆస్తి ఆమె భర్తకు చెందాలని వ్రాయబడి వుంది. అవికాక శంకర్రావు జనార్దనానికి రెండు లక్షలు క్యాషుకూడా యిచ్చి, "రేపు నీ ఆఫీసుకు కొత్తకారు వస్తుంది. అది నీదే!" అన్నాడు.

"ఇదంతా మీ రెందుకు చేస్తున్నారో నా కర్థం కావడంలేదు" అన్నాడు జనార్దనం,

"అర్థంకావడాని కేముంది? నీ మూలంగా నా కూతురు నా క్కాకుండాపోయింది. నీ కారణంగా నేను దానికి శత్రువునైపోయాను. మళ్ళీ దాన్ని నా ఇంట మనిషిలా చేయాలన్నది నా కోరిక. అది నీ మూలంగానే సాధించాలన్నది నా కోరిక. సాధించగలనన్నది నా ఆశ!" అన్నాడు శంకర్రావు.

జనార్దనానికి మామగారి బాధ అర్థమైంది. ఆయన పితృహృదయం పడుతున్న వేదనను గుర్తించే డతను. శంకర్రావుగారి సహృదయతా, సద్బుద్ధీ అతన్ని పాత సంఘటనలు మరిచిపోయేలా చేశాయి. ఎలాగో అలా ప్రయత్నించి సీత మనసు మార్చాలని గట్టిగా అనుకుని అక్కణ్నించి బయటపడ్డా డతను.

ఇంటికి వెళ్ళేసరికి సీత ఒక్కర్తీ ఇంట్లో వుంది. హంతకుడు లేడు. అతను నెమ్మదిగా భార్యవద్ద మామగారి ప్రసక్తి తీసుకువచ్చి, "జన్మనిచ్చిన తండ్రి పూజ్యనీయుడు.

ఆయన్నసహ్యించుకోవడం చాలా తప్పని నాకు తోస్తోంది" అన్నాడు.

సీత నవ్వి, "మా నాన్నగారంటే నాకు చాలా గౌరవముంది. ఆయన్నసహ్యించుకోవడం పాపంగా భావిస్తున్నాన్నేను" అంది.

"కానీ, మరి..." జనార్దనం తడబడ్డాడు.

"చూడండి_దేవుడంటే భక్తివుంది నాకు. ఆ భక్తి కారణంగా నేను యితరుల కన్యాయం చేయకూడదనుకుంటాను. నా దైవభక్తి నన్ను మంచిదాన్ని చేయాలి. నాచే పదిమందికి మంచి చేయించాలి. అంతేకానీ _ ఇంట్లోనూ, గుడిలోనూ, పలువురి ఎదుట పూవులతో పూజించడమూ, లెక్కకుమించిన స్వార్థంతో కోర్కెలు కోరడమూ దైవభక్తి అని నేననుకోవడంలేదు."

సీత తన అభిప్రాయాలను చాలా ఖచ్చితంగా చెప్పడంతో జనార్దనం చాలా ఇరుకున పడ్డాడు. ఆమె మనసులో తండ్రికి విలువ వుంది. కానీ, అందు కాయన దగ్గర్నుంచి ప్రతిఫలాన్నేమీ ఆశించడం లేదామె. ప్రతిఫలాపేక్షతో మనిషిని గౌరవించడం సీత కిష్టముండదు. తను శంకర్రావుగారిమీద గౌరవం పెంచుకున్నాడంటే అది ప్రతిఫలాపేక్షతోనే! రెండులక్షల రూపాయల నాయాచితంగా వదులుకోవడం అతనికేమాత్రమూ యిష్టంలేదు.

కాస్సేపాగి అతను తెగించి బ్రీఫ్‌కేసు తెరిచి డబ్బు కాగితాలు అన్నీ చూపించి, శంకర్రావుగారి ఔదార్యాన్ని కొనియాడాడు. అతని మాటలు వింటూ దెబ్బతిన్నట్లు కనబడింది సీత.

"మీరు మా నాన్నగారిని పొగుడుతున్నారా?"

అందామె ఆశ్చర్యంగా. "ఆయన ఒకనాడు మిమ్మల్ని పురుగుకన్న హీనంచేసి మాట్లాడారు. ఆ మాటలు తలచుకుంటూంటే ఇప్పటికీ నా శరీరం ఉడికిపోతోంది..."

"ఆవేశం మానవ సహజం. తన కూతురు తనక్కాకుండా పోతోందన్న ఆవేదన ఆయన కావేశాన్ని కలిగించి యుక్తాయుక్త విచక్షణాజ్ఞానాన్ని నశింపజేసింది. అప్పుడు మనమూ ఉద్రేకపడ్డాం. కాలం గడిచింది. ఆవేశం నశించి ఆ స్థానంలో మమకారం మళ్ళీ తలెత్తుతోంది. దాన్ని మనం అణచివేయకూడదు..."

సీత జనార్దనాన్ని పరీక్షగా చూసి, "మీకు డబ్బుమీద మోజు కలిగింది, ఎందుకో చెప్పండి!" అంది.

"ఎందుకా?" బాధగా నవ్వాడు జనార్దనం. "నువ్వెలా పెరిగావో, ఎలా బ్రతికావో తెలిసినవాణ్ని. కేవలం నా కారణంగా నీ స్థితి దిగజారిపోయిందని తెలిసినవాణ్ని. నిన్ను మళ్ళీ పూర్వపు స్థాయికి తీసుకురావడం నా వల్ల కాదని తెలిసినవాణ్ని. అనుక్షణం నేనెంత నరకాన్నను భవిస్తున్నానో నీకు తెలియదు సీతా!"

"ఎందుకండీ – నాకు లేని బాధ!" అంది సీత.

"అవును – బాధ నీ కెందుకుంటుంది? త్యాగమూర్తిగా నీ కెలాగూ పేరు వచ్చింది. నా మూలంగానే కదా నువ్వీ త్యాగం చేశావు? నీ త్యాగం నన్ను ప్రతినిత్యం దహించి వేస్తోంది!" అన్నాడు జనార్దనం.

"అంత పెద్దమాటలు వాడకండి. మీ రింత బాధ పడుతున్నట్లు నాకు తెలియదు. మా నాన్నగారి మనసు మారి, మీకూ ఆయనపట్ల మోజుగా వుంటే, అందరికీ అంగీకారంగా వుండే ఒప్పందం రేపు కుదురుస్తాను. మీ రేమీ

బాధపడకండి!" అంది సీత. "ఎటొచ్చీ ఆ షేర్ల కాగి తాలూ, ఆ డబ్బూ అన్నీ మీరు తక్షణం ఆయన కిచ్చేసి రండి. రేపు నేనే ఆయన్ను కలుసుకుని మాట్లాడుతానని చెప్పండి."

11

మర్నాడుదయం సీత హోటలుకు వెళ్ళి తండ్రిని కలుసుకుంది. ఇద్దరూ ఏకాంతంగా చాలాసేపు మాట్లాడుకున్నారు. తర్వాత ఇద్దరూ బ్యాంకుకు వెళ్ళారు. అక్కడ చాలాసేపు వ్యవహారాలు చేశారు. ఆ తర్వాత ఇద్దరూ విడిపోయారు. సీత తిన్నగా ఆఫీసుకు వెళ్ళి భర్తను కలుసుకుంది.

"మీ కోరిక నెరవేరింది. మీరు కోరిన విధంగా మీరు మీ సీతను మెయింటైన్ చేయగలుతారు" అంది సీత.

"ఏం జరిగిందని?" అన్నాడు జనార్దనం ఉత్సాహంగా.

"ఏముంది? మా నాన్నగారు నిజంగానే మారిపోయారు. ఆ విషయం ఈ రోజే గ్రహించాను నేను. ఆ షేర్లూ ఆ డబ్బూ అన్నీ తిరిగిచ్చేశారు. ఇప్పుడు నా పేరు మీద బ్యాంకులో అయిదు లక్షలు ఫిక్సెడ్ డిపాజిట్లో వేశారు. నెలనెలా మనకు కొన్ని వేలు వడ్డీగా వస్తుంది. కరెంట్ అకౌంట్లో మూడు లక్షలు క్యాషు వేశారు. సాయంత్రం లోగా కారు మీ ఆఫీసుకు వస్తుంది. ఇదీ పరిస్థితి! వ్యవహారం పూర్తి చేసుకు వచ్చాను" అంది సీత.

జనార్దనం ముఖంలో చాలా ఆనందం కొట్టొచ్చినట్లు కనబడింది. అతను బదులుగా ఏమీ మాట్లాడకపోవడం చూసి "మీ కళ్ళేం చెబుతున్నాయి మీ సంతోషాన్ని. అక్కడ నాన్నగారి కళ్ళూ అంతే. పాపిష్టిదాన్ని ఇంత

కాలం మీ ఇద్దర్నీ ఇంటికి ఆనందానికి దూరంచేశాను" అంది సీత.

"అంతమాటనకు సీతా!" అన్నాడు జనార్దనం.

"మరి నేను వస్తాను. ఈ శుభవార్త మీకు చెవులారా వినిపించిపోవాలనీ నా నోటితోనే స్వయంగా వీలైనంత తొందరగా చెప్పాలనీ ఇలా వచ్చాను. ఇంటికి వెళ్ళి మీ కోసం ఎదురు చూస్తూవుంటాను తర్వగా వచ్చేయండి."

"ఎందుకీ ఆఫీసింక, రిజైన్ చేసి వచ్చేస్తాను" అన్నాడు జనార్దనం.

"ఆపని మాత్రం చేయకండి. ఇది మన కృషితో సంపాదించుకున్న ఉద్యోగం. అయాచితంగా వచ్చిన డబ్బును దర్జాగా ఖర్చు చేయడంలో తప్పులేదు కానీ, కేవలం దాని మీదనే ఆధారపడకూడదన్నది నా అభిప్రాయం" అంది సీత.

"సరదాకన్నాను కానీ, ఉద్యోగాన్నెందుకు వదులుకుంటాను?" అన్నాడు జనార్దనం.

సీత అక్కణ్ణించి కదిలింది. ఆమె అంత ఉత్సాహంగా లేదు, తండ్రి ఇచ్చిన డబ్బు గురించి భర్త అంతగా ఉత్సాహపడడం ఆమెకు నచ్చలేదు.

ఆమె ఇంటి కెళ్లేసరికి వీధి తలుపులు బార్లా తీసి వున్నాయి. హంతకుడు వీధి గదిలో కూర్చుని వున్నాడు.

"ఎన్నడూ లేనిది, చెల్లాయీరోజు చాలా సేపు పెత్తనాలు చేసి వచ్చిందే!" అన్నాడు హంతకుడు ఆశ్చర్యాన్నభినయిస్తూ.

"నిజమే కానీ, ఇది నీ స్థలం కాదు గదా, నీకోసమని వేరే గది ఏర్పాటు చేసినప్పుడు నువ్విక్కడెందుకు

కూర్చున్నావ్?'' అంది సీత చిరాగ్గా.

"బాగుంది ఇదేమన్నా హోటలా, నాగదిలో తప్ప మసలకూడదనడానికి. ఈ ఇంటికి అతిధిగా వచ్చాన్నేను. నాకో గది ఇచ్చారు. పడుకునేందుకూ, ప్రయివేటు వ్యవహారాలకూ ఆ గది తప్పితే మిగతా ఇంట్లో మసలకూడదని లేదు గదా'' అని ఒక్క క్షణం ఆగి, "చెల్లాయ్ ఈ రోజు నాకే పనీ లేదు. మీ ఆయనతో పాటు నువ్వు బయటకు వెడితే ఇంత సేపటిదాకా రావనుకోలేదు. ఏం తోచలేదు. ఓగంట క్రితమే వీధి తలుపులు తీసుకుని కూర్చున్నాను'' అన్నాడు.

సీత ఏమి మాట్లాడలేదు.

"పొద్దున మీతోపాటు చేసిన భోజనం ఒట్టుగా ఇంకేమీ తినలేదు. హోటలుకు వెడదామనుకుంటే నీ చేతి వంట రుచి చూచినప్పట్నించీ హోటలు కూడు తినలేకుండా వున్నాను. నువ్విప్పుడు పకోడీలు వేస్తానంటే తింటాను. లేదంటే టిఫిన్ మానేస్తాను అంతే!'' అన్నాడు హంతకుడు.

సీత నవ్వుకుంది. హంతకుడికి వాక్చాతుర్యం వుంది. ఆమె మరి మాట్లాడకుండా లోపలకు వెళ్ళి తన పనులలో నిమగ్నురాలైంది. నిజంగా, మనస్ఫూర్తిగా పకోడీలు తయారు చేసింది. అవి రెడీ అయ్యే సమయానికి ఆఫీసునుంచి భర్త కూడా వచ్చాడు.

జనార్దనం వస్తూనే సినిమా ప్రోగ్రాం అన్నాడు. సీత కాదనలేదు కానీ, హంతకుడు తనూ వస్తానన్నాడు. జనార్దనం ఏమీ అనలేదు. అందరూ త్వరగా తెమిలి సినిమాకు బయల్దేరారు.

సినిమా మధ్యలో హంతకుడు లేచి జనార్దనం భుజం

తట్టి "అనుకోని నేరం తగిలింది. నేను వెడుతున్నాను" అని వెళ్ళిపోయాడు. జనార్దనం సంతోషించాడు. తను సీతతో మరింత ఫ్రీగా కబుర్లు చెప్పవచ్చునని అతనికి తోచింది.

ఇంటర్వల్లో ఒకతను సీతను పలకరించాడు. జనార్దనానికి అతనెవరో తెలియలేదు. కానీ, సీత అతన్ని గుర్తుపట్టి పలకరించింది. హాల్లో మళ్ళీ దీపాలారేక సీత అతని గురించి చెప్పింది. అతనిది సీత ఊరేనట. సీతను ప్రేమించాడట. తనకు పెళ్ళయ్యేవరకూ ప్రేమిస్తూనే వున్నాడట.

"ఇప్పుడు పెళ్ళయిందా అతనికి?" జనార్దనం కుతూహలంగా అడిగాడు.

"లేదు అతని సంగతి నాకు పూర్తిగా తెలుసు. బాగా డబ్బున్న ఆడదాన్ని వల్లో వేసుకోవాలని చూస్తున్నాడతను. అతని ప్రేమ నామీద కాదు. నా డబ్బుమీద. ఆ సంగతి నాకు తెలియదని అతని ఉద్దేశ్యం. డబ్బున్న అమ్మాయి దొరికితే రెండో పెళ్ళిదాన్నయినా ఆఖరికి పిల్లల తల్లినైనా సరే చేసుకునేందుకు సిద్ధం" అంది సీత నవ్వుతూ.

జనార్దనం ఆలోచనలు మరో రకంగా పోయాయి. సీత ఇప్పుడు ఇదివరకటి సీత కాదు. ఆమె పేరున చాలా డబ్బుంది. ఆమె ఇదివరకులా ప్రవర్తించక పోవచ్చు. ఆమెను తనేమీ వారించకపోవచ్చు. డబ్బున్న ఆడదాని ప్రవర్తన ఎలాగుంటుంది?

అతనికి లలితారాణి గుర్తుకొచ్చింది!

ఆ తర్వాత అతను సినిమా సరిగా చూడలేకపోయాడు. ఇద్దరూ ఇల్లు చేరుకునే సరికి సుమారు పదయింది.

బయట హోటల్లో భోంచేసి వచ్చేశారు. తలుపు తీసుకుని లోపలకు ప్రవేశించారు.

హంతకుడు గదిలోంచి మాటలు వినిపిస్తున్నాయి. ఇద్దరికీ ఎవరొచ్చారా అని కుతూహలం కలిగింది. సాధారణంగా హంతకుడి గదిలోకి రెండే రెండు రకాల మనుషులు వస్తారు. ఒకరు చంపాలనుకునేవారు, రెండు చావబోయేవారు.

మంచినీళ్ళిచ్చే వంకతో జనార్దనం హంతకుడి గదిదగ్గరకు వెళ్ళాడు. లోపలకు వెళ్ళేముందు కాసేపు ఆగాడు. ఎందుకంటే ఇంకా వారిద్దరు మాట్లాడుకుంటున్నారు. మాటల్లోని రెండో కంఠం స్త్రీది.

"నిజమేనంటావా అన్నయ్యా" అంది స్త్రీ కంఠం.

"అవునమ్మా ఏ ముహూర్తాన నిన్ను చెల్లాయని పిలిచానో ఆ క్షణం నించీ నీ మీద ఒక ఆత్మీయత ఏర్పడింది. అందుకే ఈ నిజం చెబుతున్నాను—" అంది హంతకుడి కంఠం.

"నమ్మలేకుండా వున్నానన్నయ్యా నా మీద హత్యా ప్రయత్నమా?"

"మరి నిన్న జరిగిన సంఘటన కాకతాళీయమంటావా?"

"నీ మాటలు వింటూంటే కాదనే అనిపిస్తోంది. కాఫీ పొడుంలో విషముంటుందని ఎలాగనుకుంటాను? అలా కాఫీ తయారుచేసి బయటకు వచ్చాను. కింద పడ్డ కాఫీ తాగి పెంపుడు పిల్లి చచ్చిపోయింది. దానికి మేమే కాఫీ అలవాటు చేశాం. ఈ సంఘటన జరగ్గానే ఆయన వణికిపోయారు."

"చూడమ్మా సినిమాహాల్లో నువ్వూ మీ ఆయన తటస్థ

పడడం మంచిదే అయింది. నేను హంతకుడినే కావచ్చు. మీ ఇంట్లో రెండు నెలలుండి నా హత్యా కార్యక్రమాలు నెరవేర్చుకుని ఉండవచ్చు. కానీ, అయిన వాళ్ళను రక్షించుకునే పద్ధతి నాకు తెలుసు. నీకిక్కడ పూర్తి రక్షణ లభిస్తుంది. ఈ రాత్రి నువ్విక్కడ వుంటావు. నేను మీ హోటలు గదిలో వుంటాను.

"అవునన్నయ్యా, నువ్వు చెప్పేదాకా నన్ను చంప డానికి బెదిరింపు ఉత్తరాలు వస్తున్నాయని కూడా నాకు తెలియదు. ఆయనకు నామీద ఎంత ప్రేమో–అందుకే గత పదిహేను రోజులుగా నన్ను కంటికి రెప్పలా చూసుకుంటు న్నారు" అందా స్త్రీ.

"అవును మరో మగాడైతే కిమన్నాస్తిగా ఊరుకునే వాడు. నా అనుమానం ఎవరో ఆడది ఈ పనులన్నీ చేస్తోందని. దానికి నీ మొగుణ్ణి పెళ్ళాడాలని ఉండవచ్చు. నువ్వు పోతే నీ ఆస్తికూడా ఆయనకు దక్కుతుంది కదా ఒక దెబ్బకు రెండు పిట్టలు కదా."

"నా ఆస్తి ఎప్పుడూ ఆయనదే దానికి నేను చావా ల్సిన అవసరం లేదు."

జనార్దనం తలుపులు తట్టాడు. లోపల మాటలు ఆగి పోయాయి. రెండు నిమిషాల సేపు గదిలో ఏదో హడా వుడి జరిగినట్లయింది. మంచం లాగిన చప్పుడు అవీ ఇవీ పడుతున్న చప్పుడు అయ్యాయి. తర్వాత తలుపులు తెరుచుకున్నాయి.

జనార్దనం ఆశ్చర్యంగా లోపలకు చూశాడు. గదిలో ఇంకెవరూ లేరు, హంతకుడు తప్ప.

"మంచినీళ్ళ గురించి మళ్ళీ రాత్రి వచ్చి మమ్మల్ని

లేపుతావేమోనని'' అన్నాడు జనార్దనం.

''బాగా గుర్తుంచుకున్నావు ధాంక్స్. కూజా యించు మించు ఖాళీ అయిపోయింది. తీసుకువెళ్ళు—'' అన్నాడు హంతకుడు.

జనార్దనం కూజా తీసుకోబోతూ ఉలిక్కిపడ్డాడు. కూజా ప్రక్కన పెద్ద ట్రంకుపెట్టి వుంది. ఆ ట్రంకు అస్తమానూ గదిలో వుండదు. మర్నాడెవరికైనా నదిలో కలపడానికే.

''సినిమా ఎలాగుంది?'' అడిగాడు హంతకుడు.

''ఏదో వుంది, నీకు తగిలిన బేరమేమిటి?''

''నా విషయం నువ్వడక్కూడదు. నేను చెప్పకూడదు ఒకవేళ నేను చెప్పకుండా తెల్సుకున్నావంటే అది నీకే ప్రమాదం'' అన్నాడు హంతకుడు.

జనార్దనం కూజా తీసుకుని బయటకు వెళ్ళిపోయి నీళ్ళు నింపి హంతకుడి గదిలో పెట్టేశాడు. కూజా గదిలో పెట్టేటప్పుడు జనార్దనం కళ్ళు వచ్చేముందు హంతకుడితో మాట్లాడుతున్న స్త్రీమూర్తి కోసం వెతికాయి. కానీ ఆమె ఎక్కడా కనబడలేదు. మంచం క్రింద దాగున్నట్లు లేదు. ఇంక రెండే రెండవకాశాలున్నాయి. ఒకటి ట్రంకులో వుండి వుండాలి. రెండు—దొడ్డివైపుకు వెళ్ళివుండాలి. ఏమైనా జనార్దనం ఆ విషయం గురించి మరీ ఎక్కువగా ఆలోచించ దల్చుకోలేదు. ఎందుకంటే అది తనకే ప్రమాదం.

రాత్రి అతనీ విషయాన్ని భార్యతో చర్చించాడు. అతను చెప్పిన వివరాలను సీత ఆశ్చర్యంగా వింది. ఈ హంతకుడిదివరలో కూడా ఇలాగే ఒకరింట్లో బసచేసి కొన్ని

హత్యలు చేసి వెళ్ళాడు. ఇప్పుడా దంపతులకు కష్టం వచ్చింది. ఆదుకుంటానని ఇద్దరిలో ఒకరిని తనింటికి తీసుకొచ్చాడు. ఆ స్త్రీ స్థానంలో తను హోటలుకు వెళ్ళదలిచాడు. ఎటొచ్చీ ఈ విషయం తనకు తెలియడం అతని కిష్టంలేదు.

మర్నాడుదయం లేచి కాలకృత్యాలు తీర్చుకోవడమయేక కాఫీలు తాగే సమయంలో "బావా నది ఒడ్డుకు రిక్షా బేరమాడిపెట్టాలి" అన్నాడు హంతకుడు.

జనార్దనం ఉలిక్కిపడ్డాడు "ట్రంకుకూడా ఉందా?" అనడిగాడు.

"అవును" అన్నాడు హంతకుడు.

సీతముఖం పాలిపోయింది. జనార్దనం కంగారుపడ్డాడు' చెల్లాయని పిలుస్తూ, రక్షణ ఇస్తానని నమ్మిస్తూ హంతకుడు ఆ స్త్రీని హత్య చేసేశాడు. ఈనిజం చాలా భయంకరంగా తోచింది.

హంతకుణ్ణి పంపించేసేకే ఇద్దరూ హంతకుడి గదిని శోధించారు. గదిలో మంచంమీద ఇదివరకటిలాగే నోట్ బుక్ వుంది. అందులో మూడోనంబరు దగ్గర శారద పేరు రాసి ఇంటూ మార్కు వేసివుంది. అక్కడే నాలుగు, అయిదు అంకెలు వేసివున్నాయి.

"ఈసారి రెండంకెలు వేసున్నాయి" అంది సీత తడబడుతూ.

"ఆ రెండూ మనమే అయినా ఆశ్చర్యం లేదు. ఈ హంతకుడికి రాగద్వేషాలు లేవు. మమతానుబంధాలు తెలియవు" అన్నాడు జనార్దనం. సీత ఒళ్ళు జలదరించింది.

ఆ నోట్ బుక్‌లోనే శారద అడ్రస్ దొరికింది. ద్వారకా

లాడ్జిలో పదకొండో నెంబరు గదిలో దిగారా దంపతు లిద్దరూ.

"ఎవరో గొప్పవాళ్ళే అయుండాలి కూడా పెంపుడు పిల్లి వెళ్ళడం..." అంది సీత.

"ద్వారకా లాడ్జిలో కాఫీ కలుపుకోవడానికీ, కోడి గుడ్లుడక బెట్టుకోవడానికీ ఫెసిలిటీసుంటూరు" అన్నాడు జనార్దనం సాలోచనగా. శారద భర్తమీద అతనికి సానుభూతి కలిగింది.

ఆఫీసుకు వెళ్ళేముందు జనార్దనం ద్వారకా లాడ్జికి వెళ్ళాడు. అక్కడ పదకొండో నంబరు గదికి వెళ్ళాడు. తలుపులు దగ్గరగా వేసివున్నాయి. తోశాడతను. తెరుచు కున్నాయి. లోపలకు వెళ్ళాడు. ఎవరూ లేరు. కానీ, బాత్రూమ్‌లోంచి మాటలు వినపడుతున్నాయి. ఒక కంఠం కాదు రెండు ఒకటి మగ రెండవది ఆడ.

జనార్దనం బాత్రూంవరకూ వెళ్ళాడు.

"వాటీజ్ దిస్ డియర్ రాగానే బాత్రూంలోకి లాగే శావు" అంటోంది స్త్రీ కంఠం.

"కాఫీ తీసుకుని బాయ్‌గాడు వస్తాడు. బాత్రూంలో వుంటే మనకింక డిస్టర్బెన్సుండదని..."

కిలకిల నవ్వింది స్త్రీ. "నీలో రసికత నానాటికీ పెరిగి పోతోంది."

"అవును నువ్వు పెంచుతున్నావు. అందుకే ఆ అడ్డు తొలగించుకోవాల్సొచ్చింది."

"నీకు నమ్మకంగా వుందా. అడ్డు తొలగించుకున్నట్లు" అడిగింది స్త్రీ.

పురుష కంఠం నవ్వు వినిపించింది. "ముందు నేనే

చంపేద్దామనుకున్నాను, కానీ అలా చేస్తే ప్రమాదముంది. నాకు తెలిసిన ఒక మనిషున్నాడు. అతనికి పని అప్పగిస్తే మనుషుల్ని యథాతథంగా మాయం చేసేస్తాడు. హత్య జరిగిన ఆనవాలుండదు. ఒక నెల రోజులు చూసి నేను నా భార్య గురించి పోలీసు రిపోర్టిస్తాను. అయిదారు నెల లాగి నిన్ను పెళ్ళిచేసుకుంటాను.''

''ఓ సిల్లీ'' అందామె. ఆమె అలా అనడానికతని మాటలు కారణం కాదనీ, లోపల జరిగిన ఏదో సంఘటన అయుండాలనీ జనార్దనానికి అర్థమయింది. అతనింక అక్కడ నిలబడదల్చుకోలేదు. అతను వెనక్కి తిరిగేసరికి గుమ్మం దగ్గర బాయ్ ఎదురయ్యాడు.

''అయ్యగారూ, అమ్మగారూ కలిసి ఇప్పుడే బాత్రూం లోకి వెళ్ళారు. నువ్వు మాట్లాడకుండా కాఫీ అక్కడ పెట్టేసి వెళ్ళిపో'' అన్నాడు జనార్దనం. బాయ్ అతని వంకే ఆశ్చర్యంగా చూస్తూంటే అతనక్కణ్ణించి బయట పడ్డాడు.

జనార్దనం మనసు మనసులో లేదు. హంతకుడి గురించి అతని మనసులో రకరకాల ఆలోచనలు కలుగుతున్నాయి ఆఫీసుకు వెళ్ళినా అతను తన పనిమీద దృష్టి కేంద్రీక రించలేక పోయాడు.

మధ్యాహ్నం లంచవర్లో ఫోన్ వచ్చింది. ''హలో జనార్దనం స్పీకింగ్'' అన్నాడతను.

''నేను లలితారాణిని మాట్లాడుతున్నాను. మధ్యాహ్నం ఆఫీసుకు సెలవుపెట్టి నా దగ్గరకు రాగలవా నేరుగా మనమెప్పుడూ కలుసుకునే ఇంటికే వచ్చేసెయ్. చాలా అర్జంటు విషయం మాట్లాడాలి!'' అందవతలి కంఠం.

12

"ఇంకెన్నాళ్ళో నిన్నూరించను మిస్టర్ జనార్ధనం! మనం కలిసి హాయిగా జీవించేరోజు దగ్గరపడింది" అంది లలితారాణి.

"అంటే?"

లలితారాణి నవ్వింది. "చూడు - నువ్వా కుర్చీలో వున్నావు. నేనీ కుర్చీలో వున్నాను. ఇద్దరూ ఒకే కుర్చీలో వుండాలంటే నువ్వు కాస్త సాహసం చేయాలి."

జనార్ధనం మాట్లాడకుండా ఆమెవంకే చూస్తున్నాడు. లలితారాణి సౌందర్యం వర్ణనలకు లొంగేదికాదు. ఆమెను చూస్తూంటే వర్ణించాలనిపించదు. తాకాలనిపిస్తుంది. తాకితే అంతటితో ఆగాలనిపించదు. కానీ, లలితారాణి అలా అపుతోంది జనార్ధనాన్ని. అతనెన్నోమార్లామెను తాకాడు. ఆమె కవ్విస్తే రెచ్చిపోయాడు. కానీ, అతన్నాట్టే దూరం రానివ్వలేదామె. హద్దుల్లో వుంచుతూనే వచ్చింది.

లలితారాణి చెబితే తన కుద్యోగం వస్తుందని ఒకరోజు అనంతం చెబితే ఆమెను చూడ్డానికి వెళ్ళాడు. లలితారాణి అతనూహించినట్లు వయసుమళ్ళిన స్త్రీ కాదు. వయసులో తనకంటె చిన్నది. ఆమె అతనికి ఉద్యోగం ఇప్పించే ముందు చెప్పింది. "ఒక చిన్న షరతు. ఉద్యోగం వచ్చేక నువ్వు నేను చెప్పినపని చేయాలి. ఆ పని కష్టమైన దేమీ కాదు. నీ వల్లన అయ్యేదే!"

దొరకబోయే ఉద్యోగం చాలా మంచిది కావడం కారణంగా అతను తల ఊపాడు. ఉద్యోగం దొరికాక లలితారాణి తన కోరిక చెప్పింది. "నాకు నువ్వు నచ్చావు. నేను

నిన్ను కోరుతున్నాను.''

జనార్దనానికి అంతవరకూ ఏమీ అభ్యంతరం కాలేదు. కానీ, ఆమె తరువాతిమాట లతన్ని కంగారుపెట్టాయి.

''నేను నిన్ను పెళ్ళి చేసుకోవా లనుకుంటున్నాను.''

ఆతనికి నోట మాటరాలేదు.

''నాకు అందముంది. డబ్బుంది. పలుకుబడుంది. వీటన్నింటితోపాటు సంపూర్ణ స్త్రీత్వముంది'' అందామె.

జనార్దనం అవాక్కైపోయాడు.

లలితారాణితో వివాహం జనార్దనానికి చాలా ఆనందంగానే వుంది.

''మాట్లాడకుండా అలాగే చూస్తూ వుండిపోయావు'' అంది లలితారాణి!

''చెప్పు-నేనేం సాహసం చేయాలో?''

''నీ భార్యపేరున పదిలక్షలు బ్యాంకులో వుందని విన్నాను. నిజమేనా?''

''ఎలా తెలిసింది?''

''చూడు డియర్! నీ మామగారు కుబేరుడు. ఎప్పుడో ఒకప్పుడిలాంటిది జరక్కపోతుందా అని ఆశగా ఎదురు చూస్తున్నాను. మనమిద్దరం పెళ్ళి చేసుకోవాలంటే ఎలాగూ నీ భార్య చావాలి! వ్రతం చెడ్డా ఫలం దక్కాలని నీ భార్య చస్తే నీకాస్త ఆస్తి కలిసిరావాలి గదా— అలాగైతే నీకూ చిన్నతనంగా వుండదు. మనమిద్దరం సముజ్జీలమవుతాం'' అంది లలితారాణి.

''అంటే?'' అన్నాడప్రయత్నంగా జనార్దనం.

''ఎవరికీ అనుమానం రాకుండా నీ భార్య చావాలి - అప్పుడీ లలితారాణి నీదవుతుంది. అంతులేని సంపదతో,

అనంతమైన సౌందర్యంతో...''

జనార్దనానికి ఆమె మాటలు వినబడడంలేదు. అతని మెదడు గజిబిజిగా తయారైంది.

లలితారాణి చటుక్కున వచ్చి అతన్ని కౌగలించుకుంది. ''ఇంకా ఎన్నాళ్ళు డియర్! త్వరగా తేల్చేయి. ఆగడం నాకూ కష్టంగానే వుంది.''

జనార్దనానికి ఆ కౌగిలి చాలా హాయిగా వుంది. ఎక్కడ తప్పించుకుంటుందో నన్నట్లు బలంగా ఆమెను అదిమి పట్టుకున్నాడు. ''కానీ, ఎలా?'' అన్నమాట అప్రయత్నంగా అతని నోటినుంచి వచ్చినప్పుడు అతని మెదడులో హంతకుడు మెదులుతున్నాడు.

13

''వారంరోజులుగా ఏదోలా వుంటున్నారు మీరు!'' అంది సీత.

జనార్దనం నీళ్ళు నమిలి, ''ఏమీ లేదు_కాస్త నీరసంగా వుంటోంది'' అన్నాడు. సీతను చూస్తుంటే అతనికి జాలి వేస్తోంది. సీత చూడ్డానికి చాలా సంసార పక్షంగా వుంటుంది. ముఖం మరీ అంత అందమైనది కాదు కానీ, కళగా వుంటుంది. ఆమె అమాయకత్వానికి ఆకర్షించబడి ఆమెతో పరిచయం పెంచుకున్నాడతను. డబ్బున్నవాళ్ళమ్మాయని తెలిసేక అతని పరిచయం ప్రేమలోకి దిగింది.

జనార్దనం చాలా అందంగా వుంటాడు. అతనికి ఆకర్షణీయమైన కళ్ళున్నాయి. అతని ముఖం చూస్తుంటే అమాయకుడనిపిస్తుంది. సీత జనార్దనాన్ని ప్రేమించేసింది. అతని సత్ప్రవర్తన ఆ ప్రేమను రోజురోజుకీ పెంచింది. చివర కతనికోసం కన్న తండ్రిని కాదనే స్థితికి వచ్చిందామె.

జనార్దనం దుర్మార్గుడు కాదు. కానీ, మానవుడు. అందు లోనూ ఆదర్శాలకోసం ప్రాణాలు బలిపెట్టగల గుండె నిబ్బరం కలవాడు కాడు. రెచ్చగొట్టేవాళ్ళుంటే బల హీనతలకు లొంగిపోయే సామాన్య మానవుడు.

సీత తండ్రివద్దనుంచి పదిలక్షలు తీసుకున్నది కానీ, ఆ డబ్బుపట్ల ఆమెకు ఆసక్తి లేదు. ఆ డబ్బు ఖర్చు పెట్టాల్సి వస్తే ఆమె కళ్ళల్లో అసంతృప్తి స్పష్టంగా కనబడుతుంది. జనార్దనాని కది నచ్చడంలేదు. ఆ డబ్బును హాయిగా, దర్జాగా ఖర్చుచేయాలనుం దతనికి. అందుకు సీతే అడ్డుగా వుంది!

సీత అడ్డు తొలగితే లలితారాణి జనార్దనం స్వంత మవుతుంది. అది మధురాతి మధురమైన జీవనం. మనిషై పుట్టేక అలాంటి బ్రతుకు బ్రతకాలి! అలాంటి బ్రతుకు కోసం ఏమైనా చేయాలి!!

అతనిలో సీతను చంపాలన్న కోరిక బలపడినకొద్దీ ఏదో మూల దిగులావరించుకుంటోంది. అది సీత కనిపెడు తూనూ వుంది. ఆమె అడిగినప్పుడల్లా ఏదో జవాబు చెప్పి తప్పించుకుంటున్నాడు జనార్దనం.

ఆ రాత్రి జనార్దనం హంతకుడిని కలుసుకుని, "నీతో కాసేపు ఏకాంతంగా మాట్లాడాలి!" అన్నాడు.

"సారీ బావా _ నాకీ రోజు తీరుబడిలేదు. విషయ మేమిటో చెప్పు" అన్నాడు చిరాగ్గా హంతకుడు.

జనార్దనం తెగించి, "ఒక హత్య విషయం" అన్నాడు.

హంతకుడు కళ్ళెగరేసి, "ఎంతివ్వగలవు?" అన్నాడు.

"చేస్తావా?" అన్నాడు జనార్దనం.

"తప్పకుండా_కానీ, ఒక అరగంట పోయేక రా_అప్పు

డన్నీ వివరంగా మాట్లాడుకుందాం. ఈలోగా నాకింకో చిన్నపని వుంది" అన్నాడు హంతకుడు. జనార్దనం లేచి వెళ్ళిపోయాడు.

సీతను పడుకోమని చెప్పి అతను సరిగ్గా అరగంట అనంతరం హంతకుడి గదిలోకి వెళ్ళాడు.

"వివరంగా చెప్పు - ఇన్నాళ్ళు మా ఇంట్లో చక్కని ఆతిథ్యమిచ్చావు. అందుకు ప్రతిఫలంగా నీకేదైనా సాయంచేయాలని అనుకున్నాను. ఈలోగా నువ్వే అడిగావు. ఎవర్ని చంపాలో చెప్పు. ఫీజు అడక్కుండా పని చేసిపెడతాను."

జనార్దనం తడబడ్డాడు. "పథకం ఎలా వేస్తావో నాకు తెలియదు. ఆ మనిషి ఎక్కడికి వెళ్ళిందో, ఎలా వెళ్ళిందో ఎవరికీ తెలియకూడదు. ఏమైపోయిందో ఎవరికీ తెలియకూడదు. నా మీదకు ఎవరికి అనుమానం రాకుండా మాయమైపోవాలి."

"ఎవరా మనిషి!" అన్నాడు హంతకుడు కుతూహలంగా.

"నాభార్య సీత!" అన్నాడు జనార్దనం. అతని కంఠం వణికింది.

హంతకుడి ముఖంలో ఏమాత్రం ఆశ్చర్యం కనబడలేదు. "ఒస్ ఇదేనా చాలా సులువైన పని చెప్పావ్, అలాగే చేస్తాను. సీత మామూలు ఆడది. భర్తేదైవమని నమ్ముకున్నది. ఇలాంటి వాళ్ళను మాయం చేయడం చాలా సులువు. చచ్చేముందుకూడా భర్తననుమానించరు వాళ్ళు. ఇలాంటి వాళ్ళను చంపడం చాలా సులభం. సుమారు వారం రోజుల క్రితం ఇలాంటి కేసే..." అని ఆగి "అవన్నీ

నీకెందుకులే చెప్పడం కానీ...నీ పెళ్ళాన్నెందుకు చంపా లనుకుంటున్నావ్?" అన్నాడు హంతకుడు.

"లలితారాణిని పెళ్ళిచేసుకోబోతున్నాను నేను..." అన్నాడు జనార్దనం.

"వండ్రఫుల్ చాలా మంచిది. మీ పెళ్ళయాక ఎప్పుడైనా ఇదే విధంగా మీ ఇంట్లో మకాం పెట్టి నా పనులు చూసుకోవచ్చు. ఎట్లొచ్చీ విశేషమేమిటంటే నా అనుభవానికి సంబంధించినంతవరకూ నేను మకాం పెట్టిన ప్రతి ఇంట్లోని మగాడూ తన భార్యను చంపించేశాడు" అన్నాడు హంతకుడు నవ్వుతూ.

జనార్దనం మళ్ళీ తడబడ్డాడు. "సరేలే కార్యం ఎలా సాధించాలో చెప్పు" అన్నాడు.

"చాలా సింపుల్!" అన్నాడు హంతకుడు. "పనిమీద బయల్దేరి పొరుగూరు వెళ్ళు నువ్వు. వారం రోజుల అనంతరం తిరిగి రా. ఎవ్వరూ అనుమానించలేని పరిస్థితుల్లో నీ భార్య మాయమవుతుంది. ఇంక మరెన్నడూ నీకంట బడదు."

ఆ మాటలు బాగా గుర్తు పెట్టుకున్నాడు జనార్దనం. అందుకే అతను రెండ్రోజుల అనంతరం పని వంక పెట్టి పొరుగూరు వెళ్ళుతున్నానని చెప్పేటప్పుడు భార్యను తనివి తీరా చూశాడు. తప్పు చేస్తున్నానన్న భావన అతన్ని కాల్చింది.

అతను వెళ్ళేటప్పుడు హంతకుడు "నువ్వూరికెళ్ళి పోతున్నావు. ఈ వారం రోజుల్లోనూ ఎప్పుడైనా ట్రంకు మోసి రిక్షాలో పెట్టడానికి ఎవరిసాయం అడగను!" అన్నాడు.

ట్రంకులో తన భార్య సీతను తల్చుకుంటే ఒళ్ళు జలదరించింది జనార్దనానికి.

14

రైల్వే స్టేషన్లో దిగిన జనార్దనం ఇంటికి వెళ్ళడానికి చాలా భయంగా వుంది. ఏమీ ఎరగనట్లుగా ఇంటికి ఓ టెలిగ్రాం కూడా ఇచ్చాడు తను వస్తున్నట్లు.

కానీ ఇంటిదగ్గర భార్య తన కోసం ఎదురు చూస్తూ వుండదు. ఆమె ఈపాటికి మరోలోకం చేరుకునివుంటుంది. తను పొరుగూరు వెళ్ళిన సమయానికి ఆమెను హంతకుడు "పొరుగూరు" పంపించేసి వుండాలి! తను యీవారం రోజులు పటిష్టమైన ఎలిబీ సంపాదించుకొని వున్నాడు.

జనార్దనం ముందుగా హోటల్ కు వెళ్ళి టిఫిన్ చేశాడు. తర్వాత ధైర్యం చేసి ఇంటికి వెళ్ళాడు.

ఇంటిదగ్గర ఏమీ హడావుడిగా లేదు. చుట్టుపక్కల వాళ్ళు తనను చూసి ఏ విధమైన విచిత్ర భావాలూ ప్రకటించలేదు. అంతా మామూలుగానే వుంది వాతావరణం.

ఇంటి తలుపులు తాళంవేసి లేవు. అంటే ఇంట్లో ఎవరో వున్నారన్న మాట. బహుశా హంతకుడుండివుంటాడు. జనార్దనం తలుపులు తట్టాడు.

తలుపులు తెరుచుకున్నాయి. తలుపులు తీసిన వ్యక్తిని చూసి ఉలిక్కిపడ్డాడు జనార్దనం.

అతనెవరో కాదు. ఒక రాత్రి తన గదిలో హత్య చేయబడి వుండగా చూసేడతను. అతను అనంతం!

జనార్దనం భయపడ్డాడు. కొంపలు దీసి ఈ యింట్లో దెయ్యాలు జేరలేదు కదా! "రండి జనార్దనంగారూ లోపలకు రండి!" అన్నాడు అనంతం. ఇంట్లో ఇంకా చాలా

మంది జనం మసలుతున్నట్లు తోస్తోంది. జనార్దనం సందేహిస్తూనే లోపల అడుగుపెట్టాడు.

"ఎవరూ" అందొక స్త్రీ కంఠం. జనార్దనం ఆకంఠాన్ని గుర్తుపట్టాడు. ఆ స్త్రీ గదిలోకి ప్రవేశించింది. ఆమే లలితారాణి.

"జనార్దనం వచ్చేశాడు!" లలితారాణి గట్టిగా అరిచింది. అప్పుడాగదిలోకి చాలామంది వచ్చేశారు. కంగారుగా, అనుమానంగా అందర్నీ చూస్తున్నాడు జనార్దనం. అతనికేమిటో భయంగావుంది. వాళ్ళలో అతను హంతకుడినీ, శంకర్రావుగారినీ, సీతనూ గుర్తుపట్టాడు.

సీతను చూస్తూనే జనార్దనం తడబడ్డాడు. అతనికి నోటమాటరాలేదు.

సీత మాట్లాడింది "మిమ్మల్ని నేను ప్రేమించాను. అందుకని అయినవాళ్ళందర్నీ వదులుకుని వచ్చాను. కన్న తండ్రిని తృణీకరించాను. కానీ కన్నతండ్రి ప్రేమకీ ప్రపంచంలో సాటి అయినదేదీ లేదని చాలా ఆలస్యంగా గ్రహించాను."

సీత ఆగింది. శంకర్రావు ముందుకువచ్చాడు. "ఈ ప్రపంచంలో కవులూ, రచయితలూ ధనవంతులు కాకపోవడం ధనవంతుల దురదృష్టం. డబ్బు సంపాదించడం కోసం రచనలు చేసే వీళ్ళు డబ్బు సమస్త పాపాలకూ మూలహేతువనీ డబ్బున్న వాళ్ళగుండెలు రాతి బండలనీ, అనురాగం, ఆప్యాయత అన్న పదాల కర్థం పేదవారిళ్ళలోనే దొరుకుతుందనీ రాసి ప్రజల్లో ప్రచారం చేస్తున్నారు. చిన్నప్పట్నించీ సాహిత్యమంటే అపారమైన ఆశక్తిగల నాకూతురు సీతలో ఇవే అభిప్రాయాలు బలపడ్డాయి.

వాటినే నాముందు వర్ణించి నామాట కాదని నాతో తెగ తెంపులు చేసుకుని నీ ఇల్లాలుగా వుందామని వచ్చింది. కానీ నువ్వందుకిచ్చిన ప్రతిఫలమేమిటి?"

జనార్దనం ఆశ్చర్యంగా మామగారివంక చూస్తున్నాడు. ఆయన చెప్పేదేమిటో అతనికి పూర్తిగా అర్థంకావడం లేదు కానీ తన పన్నాగం వాళ్ళందరికీ తెలిసిపోయిందని మాత్రం తెలిసింది.

"చూడు నాయనా ఒక ఆడదాని అందం, పదిలక్షల రూపాయలు నిన్ను హత్యకు పురిగొల్పాయి. ఈపొరపాటు డబ్బుదని అంతా అంటారు. డబ్బుకు ప్రాణంలేదు. డబ్బులో జీవంలేదు. డబ్బు తనంతట తనేమీ చేయలేదు. మనిషి బలహీనతే అన్ని పాపాలకూ మూలకారణం. పేదింటివాడెవ్వడూ బలహీనతలకు లోనుకాడని ఇల్లు వదిలేముందు నా కూతురు నన్ను సవాలు చేసింది. డబ్బుకు లొంగేది పేదవాడే అందువల్లనే ధనవంతుల ఆటలు సాగుతున్నాయని నేనూ సవాల్ చేసాను." శంకర్రావుగారాగి "నిన్ను ప్రలోభ పెట్టడానికి, నిన్ను తప్పుదారిలో మళ్ళించడానికి నేను లలితారాణిని, హంతకుడిని వియోగించాను. డబ్బునుపయోగించాను. నేననుకున్న ప్రకారమే నువ్వు దారి తప్పావు. ఇదంతా ఎందుకు చేశానను కుంటున్నావ్! సవాలులో నెగ్గడానికా...కాదు. సీతకు జీవితమంటే ఏమిటో తెలియజేయడానికి. కలల్లో తేలి పోకుండా వాస్తవజీవితాన్వరం చేసుకునేలా చేయడానికి. ఆమె జీవితానికి శాశ్వత రక్షణ కల్పించడానికి!" అన్నాడు.

జనార్దనం అవాక్కైపోయాడు. అతనికంతా అర్థమై

పోతోంది. తను పెద్ద వలలో చిక్కుకున్నాడు తనకు తెలియకుండానే!''

''నువ్వు సీతను హత్య చేయమని హంతకుడితో చెప్పిన మాటలనతను రికార్డు చేశాడు, ఎప్పుడైనా సీత ప్రాణాలకు హాని సంభవించిందా ఆ సాక్ష్యాధారం చాలు నిన్ను దోషిని చేయడానికి. అందుకని ఆమె జీవితంపట్ల ఇప్పుడు నీబాధ్యత పెరిగింది. ఆమెను నువ్విప్పుడు వెయ్యికళ్ళలో కాపాడవలసిన అవసరం ఏర్పడింది.''

జనార్దనం రెండు చేతులతో ముఖం కప్పుకుని నేల మీద కూలబడి ఏడవసాగాడు. సీత అతన్ని సమీపించింది అతని ముఖంమీద చేతులు వేసి అతని కన్నీరు తుడిచింది.

''మీమీద నాకసహ్యం లేదు. నేను ఇప్పటికీ మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. సవాల్ మా నాన్నగారి చేతిలో ఓడిపోవడం నాకు బాధగా వున్నా మానవుడి బలహీనతల నరం చేసుకునే తెలివివచ్చింది. మనకింకా నూరేళ్ళజీవితముంది. పాతసంగతులు మరిచిపోయి కొత్త జీవితాన్ని ప్రారంభిద్దాం. ఈ క్షణంనించీ నిజమైన ప్రేమికులుగా మారుదాం.''

హంతకుడు ముందుకు వచ్చి ''అవును ఆఅవసరం చాలా వుంది. మళ్ళీ ఎప్పుడైనా ఈ ఊరొస్తే మీ దంపతులే మళ్ళీ నా ఆతిథ్యమివ్వాలి'' అన్నాను.

జనార్దనం కళ్ళు తుడుచుకున్నాడు. అతని కళ్ళముందు సీత కనబడింది. తలెత్తి పైకి చూశాడు. అప్పుడే వెనుదిరిగిన లలితారాణి కనబడింది.

చుట్టూ చూస్తున్నాడతను. కొద్ది రోజులుగా తన జీవితరంగంలోకి ప్రవేశించిన ఒక్కో పాత్రే నిష్క్రమి

మిస్తోంది. మరో అయిదు నిముషాల్లో ఆ యిల్లు ఖాళీ అయిపోయింది.

గదిలో సీత, జనార్దనం మిగిలారు!

"కొత్త జీవితాన్ని ప్రారంభిద్దాం. ఈ క్షణంనుంచీ నిజమైన ప్రేమికులుగా మారుదాం" అన్న సీత మాటలు జనార్దనం చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. అతను సీత ముఖంలోకి చూశాడు.

పరీక్షలో ఫెయిలైన విద్యార్థిని చూస్తే కలిగే జాలి తనను చూస్తున్న ఆమె కళ్ళలో జనార్దనానికి కనిపించింది. జాలిలోంచే ప్రేమ పుట్టుకొస్తుందన్న ఒక రచయిత మాటలతనికి గుర్తుకొచ్చాయి.

సీతను గట్టిగా హృదయానికి హత్తుకున్నాడు జనార్దనం ఆ బంధం ఇక ఎన్నటికీ విడిపోని బంధం.

—: ఐపోయింది :—